ఏడుగురు దొంగలు!!

అజీజ్

"ఇన్నాళ్ళూ మనం చేసినవన్నీ చిన్నచిన్న నేరాలు. తడవకి పదివేలకన్నా ఎక్కువ సంపాదించలేకపోయాం! అందులో మళ్ళీ ఐదు వాటాలు! అప్పుడప్పుడూ జైలు కటకటాలు! ఎన్నాళ్ళీ ముతక బతుకులు?

అందుకే, ఈసారి తీవ్రంగా ఆలోచించి, అనేక అవస్థలు పడి, అత్యంత పటిష్టమైన ఓ పథకం అల్లాను. అది నిర్విఘ్నంగా పారిందంటే, మనకెంత గిట్టుబాటవుతుందో తెలుసా?" అన్నాడు అంబాదాస్ తనమిత్రులను చూస్తూ.

అంతవరకూ కుర్చీలో కునికిపాట్లు పడుతున్న రజాక్ ఉలిక్కిపడి, "ఎంత?" అని అడిగేడు.

"ఏభై లక్షలు!"

"బాప్రే" నోరు తెరిచాడు సుందర్‌సింగ్. కర్ణన్, అబ్రాహాంకూడా ఆశ్చర్యంగా చూశారు.

"ఇంతకీ పథకంఏమిటి?" అడిగేడు అబ్రాహాం సిగరెట్ అంటిస్తూ.

"చెవులు రిక్కించుకు వినండి! రేపు మధ్యాహ్నం రెండున్నర గంటలకు మనం ఐదుగురం కలిసి, పట్టపగలు మౌంట్ రోడ్లోని నేషనల్ బ్యాంక్ దోచుకో బోతున్నాం!"

ఏదో విట్టువిన్నట్టు పకపక నవ్వేడు కరణ్. "నీకు పిచ్చిగానీ పట్టలేదుకదా? పథకమంటే ఇంకేమో అనుకున్నాను. పట్టపగలు నేషనల్ బ్యాంక్ దోచుకోడమే! ఇదేమైనా బొమ్మలాటనుకున్నావా? లేక, తెలుగు క్రైమ్ పిక్చర్ మాదిరి దోపిడీ అనుకున్నావా?

ఆ బ్యాంకు సంగతి నీకు తెలీదా? వాల్ట్ రూంలో ఎల్లప్పుడూ ఇద్దరు గార్డ్స్ రైఫిళ్ళతో సహా కాపలా కాస్తుంటారు. అంతేకాదు. వాల్ట్ లోపల ఓ అలారమ్ పుష్ కూడా ఉందిట.

ఏదైనా ప్రమాదం ముంచుకొస్తే, ఆ పుష్బటన్ వత్తిన మరుక్షణం మౌంట్ రోడ్ పోలీస్ స్టేషన్లో అలారం మోగుతుంది. మరు నిమిషంలోనే పోలీసులు బ్యాంకును చుట్టుముట్టేస్తారు!"

"తెలుసు! ఆ సమస్య అన్నిటికీ పరిష్కార మార్గాలు ఆలోచించే, పథకాన్ని మీ ముందుంచుతున్నాను. ముందవి చూడండి!" అంటూ జేబులోంచి ఆరంగుళాల పొడవున్న ఓ గ్యాస్ ట్యూబూ, మడతపెట్టిన కొన్ని కాగితాలూ తీసి బల్లమీదుంచేడు అంబాదాస్.

గ్యాస్ ట్యూబ్ ఎత్తి మిగతా నలుగురికీ చూపుతూ_ "ఇందులో అత్యంత శక్తివంతమైన క్లోరోఫైడ్ గ్యాస్ నింపి వుంది. దీన్ని నేలకేసి కొట్టిన మరుక్షణం ట్యూబ్ పగిలి, గ్యాస్ బైటికొస్తుంది. ఎటువంటివారైనా క్షణంలో నేలకొరిగి మూర్ఛపోతారు!" అంటూ ఆ ట్యూబ్ బల్ల

మీద పెట్టేసి, కాగితాలందుకున్నాడు అంబాదాస్.

వాటి మడత విప్పి, అబ్రాహాంవైపు చూసేడు.

"నువ్వీ కాగితాలని క్షుణ్ణంగా పరిశీలించి అవగాహన చేసుకోవాలి. ఇవి ఆ బ్యాంకు ఎలక్ట్రిక్ సర్క్యూట్ బ్లూప్రింట్లు!

ఇవి లేకుండా మన పథకం అమలుజరపడం అసంభవం! వీటిని సంపాదించడానికి నేనెన్ని అవస్థలు పడ్డానో ఆ భగవంతుడికే తెలుసు. వీటిద్వారా ఆ బ్యాంకులో ఫ్యూజ్ బోర్డులెక్కడున్నాయో, అవి దేనికి సంబంధించినవో, ఏ వైరు ఎక్కడి కెళ్తుందో స్పష్టంగా తెలుసుకోవచ్చు...

ఇహ నా పథకం ఏమిటో జాగ్రత్తగా వినండి:

బ్యాంకు 'వాల్ట్' రెండో అంతస్తులో వుంది. వర్కింగ్ అవర్స్‌లో అది తెరిచే వుంటుంది. ఆ గది మొత్తం ఎయిర్ కండిషన్ చెయ్యబడింది, అగ్నిప్రమాదం సంభవించకుండా!

అక్కడ ఇద్దరు క్యాషియర్లు కూర్చుని డబ్బు లావాదేవీలు చూస్తుంటారు. వాళ్ళకు సహాయకారిగా ఓ కంప్యూటర్ కూడా వుంటుందక్కడ. వాల్ట్ రూంను కాపాడటానికి అది తెరిచున్నంత సేపూ, ఇద్దరు గార్డులు ఎల్లవేళలా లోపలుంటారు.

మధ్యాహ్నం రెండు గంటలకి బ్యాంకు బిజినెస్ కట్టెయ్యబడుతుంది. లోపల ఉద్యోగులు మాత్రం తమ తమ పనుల్లో నిమగ్నమై వుంటారు.

సరిగ్గా రెండుగంటల పదిహేను నిమిషాలకి అబ్రాహాం-ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ మెకానిక్ యూనిఫాంలో, బ్యాంకులో అడుగుపెడతాడు.

సాధారణంగా ఆ బ్యాంకులో అడపాదడపా ఏదో ఒక ఎలక్ట్రిక్ డిఫెక్టు వస్తూనే వుంటుంది. వాళ్లు కార్పోరేషన్‌కు ఫోన్ చేసి, ఎలక్ట్రిషియన్లని పిలుస్తూనే వుంటారు. ఎలక్ట్రిషియన్ రాగానే బ్యాంకు ప్రవేశద్వారం ముందు నిల్చునే గూర్ఖా అతన్ని లోనికి తీసికెళ్ళి ఫ్యూజ్ బాక్సు చూపిస్తాడు. లేదా, ఫ్యాన్ కప్పగిస్తాడతన్ని!

అబ్రాహాం పనల్లా—ఈ బ్లూప్రింట్స్ సహాయంతో సరిగ్గా రెండు గంటల ముప్పై నిమిషాలకు, వాల్ట్‌రూం ఏర్‌కండీషనర్ కరెంట్ సర్క్యూట్ కట్ చెయ్యాలి! తరవాత, ఐదు నిమిషాల వ్యవధి ఇచ్చి, వాల్ట్‌రూంలో వున్న కంప్యూటర్ సర్క్యూట్ కట్ చెయ్యాలి. దాంతో అది పనిచెయ్యడం ఆపేస్తుంది. అది ఐ.బి.ఎమ్ కంపెనీ తయారుచేసిన కంప్యూటర్ ...

ఆ రెండు సర్క్యూట్‌లూ కట్ చేసిన అరగంట తరవాత, అంటే సరిగ్గా మూడు గంటలకు కట్ చేసిన ఏర్‌కండీషన్ సర్క్యూట్‌ను తిరిగి కలిపెయ్యాలి. అబ్రాహాం చెయ్యవలసిన పని ఇంతే!

ఇక మిగతావాళ్ళ డ్యూటీ—

సరిగ్గా రెండుగంటల ఇరవైఐదు నిమిషాలకు నేనూ, కరణ్, రజాక్, సుందర్‌సింగ్ ఓ స్టేషన్ వ్యాగన్‌లో, బ్యాంకు వెనకవైపు గేటుగుండా లోనికి ప్రవేశిస్తాం!

ఆ గేటు పక్కనే చిన్న కుటీరం వుంది. అందులో ఓ ముసలి వాచ్‌మెన్ ఎప్పుడూ డ్యూటీమీదుంటాడు. మన మందరం ఐ.బి.ఎమ్ కంపెనీ మెకానిక్స్ యూనిఫారాల్లో వుంటాము.

ఆ వ్యాన్ లోపల ఓ పెద్ద సైజు కార్డ్‌బోర్డ్ పెట్టె వుంటుంది. దాని నాలుగువైపులా, ఐ.బి.ఎమ్ కంప్యూటర్

అని రాసివుంటుంది. నిజానికందులో వుండేది కంప్యూటర్ కాదు! రెండు గ్యాస్ మాస్కులూ, రెండులో డెడ్ రివాల్వర్లూ!

వ్యాన్ బ్యాంకు వెనక కంపౌండ్‌లో ఆగగానే, సుందర్ సింగ్, రజాక్, కర్ణన్ దిగి వ్యాన్ వెనక తలుపు తెరుస్తారు. తరవాత, కర్ణన్ అక్కడ కాపలా వుండే వాచ్ మెన్ దగ్గరికెళ్ళి, బ్యాంకులోని కంప్యూటర్ చెడిపోయిందనీ, వెంటనే కొత్త కంప్యూటర్ తీసుకురావలసిందిగా బ్యాంకు మేనేజర్ ప్రసాదరావు తమ కంపెనీకి ఫోన్ చేశారనీ, కొత్తకంప్యూటర్ తెచ్చామనీ చెప్పాలి!

సరిగ్గా అదే క్షణంలో బ్యాంకు లోపల అబ్రహాం! కంప్యూటర్ సర్క్యూట్ కట్ చేసుంటాడు. వాచ్ మెన్ సందేహ నివృత్తికోసం, వాల్టుమాంకు ఫోన్ చేసి కనుక్కుంటాడు, కంప్యూటర్ నిజంగా పాడయిందా అని!

ఔనని జవాబు వస్తుంది. దాంతో అతనికి మనమీద నమ్మకం ఏర్పడి, ఆ పెట్టె లోనికి తీసికెళ్ళడానికి అనుమతిస్తాడు. కర్ణన్ అక్కడే అతనితో కబుర్లాడుతూ నిల్చుండిపోతాడు.

సుందర్ సింగ్, రజాక్ ఇద్దరూ కలిసి, ఆ పెట్టె మోసుకుంటూ బ్యాంకులో ప్రవేశించాలి. మెట్లెక్కి రెండో అంతస్థులో వున్న వాల్టురూం చేరుకోవాలి.

అక్కడ సుందర్ సింగ్ పెట్టెమూత తెరిచి, మెరుపులా అందులోవున్న రివాల్వర్ బైటికి తీసి, కేషియర్లనూ, గార్డులనూ చేతులు పైకెత్తించాలి.

అలాగా, రజాక్ గ్యాస్ మాస్కు మొహానికి తొడుక్కుని, తన రివాల్వర్‌తో అందర్నీ కవర్ చేస్తూ నిల్చుంటాడు. ఆ వ్యవధిలో సుందర్ సింగ్ కూడా మాస్కు

తొడుక్కుని, గ్యాస్ ట్యూబ్ ను నేలకేసి కొడతాడు.

మరుక్షణం వాల్ట్ రూం గ్యాస్ తో నిండిపోతుంది.

కేషియర్లూ, గార్డులూ కిందకూలి మూర్ఛపోతారు. ఆ తరవాత మీరిద్దరూ సాధ్యమైనంత త్వరగా పెట్టెలో నోట్లకట్టలు నింపుకుని బైటపడాలి.

అదే క్షణంలో అబ్రాహాం వాల్ట్ రూం ఏర్ కండిషనర్ సర్క్యూట్ తిరిగి కలిపేస్తాడు. ఏర్ కండిషనర్ తన పని ప్రారంభించగానే,లోపలి గ్యాసంతా బైటికెళ్ళిపోతుంది.

మీరిద్దరూ గ్యాస్ మాస్కులు తీసిపడేసి, రివాల్వర్లు జేబుల్లో వేసుకుని, పెట్టెతో బైటపడాలి. బైట నిల్చున్న వాచ్ మెన్ మీరా పెట్టెలో చెడిపోయిన కంప్యూటర్ తెస్తున్నారేమో అనుకుని, దాన్ని తెరిచిచూసే ప్రయత్నం చెయ్యడు!

మీరు తిన్నగా పెట్టెని వ్యాన్ లో పెట్టేసి, తలుపు లాక్ చెయ్యాలి. ఆ తరవాత, మన మక్కణ్ణించి అదృశ్యం కావడానికి క్షణం పట్టదు.

ఇదీ పథకం! ఇందులో ఒక్కొక్క క్షణం అతి విలువైనది. పనులన్నీ ఫిక్సడ్ టైమింగ్ లో జరిగిపోవాలి.

ఇందులో ఎవ్వరికైనా సందేహాలుంటే, ఇప్పుడే క్లియర్ చేసుకోడం మంచిది'' అన్నాడు అంబాదాస్.

''మా నలుగురికీ నాలుగు పనులైతే కేటాయించావ్, మరి నీ డ్యూటీ ఏమిటి?'' అడిగేడు రజాక్.

''నేను వయసులో మీకన్నా పెద్దవాణ్ణి. పైగా గుండెజబ్బు గలవాణ్ణి. ఏ కాస్త ఎక్సైట్ మెంట్ కు గురైనా, ఏ కాస్త బరువెత్తడానికి ప్రయత్నించినా గుండెలో పోటు వస్తుంది!

అందుకే, నేను వ్యాన్ డ్రైవర్‌గా వ్యవహరించాలను కుంటున్నాను. ఫాస్ట్ డ్రైవింగ్‌లో నాకున్న ప్రావీణ్యం గురించి మీ అందరికీ తెలుసు! పథకం పారగానే, డబ్బుతో సహా మిమ్మల్ని సురక్షితంగా ఇక్కడికి చేర్చడం నా బాధ్యత!'' అన్నాడు అంబాదాస్.

''ఆల్ రైట్! ఇంతకీ వాల్ట్ రూంలో ఏర్ కండిషన్ దేనికి ఆఫ్ చేయాలంటావు?'' అడిగాడు అబ్రాహాం.

''ఎందుకంటే, చల్లని ప్రదేశాల్లో ఆ గ్యాస్ వెంటనే ప్రభావం చూపదు. ఏర్ కండిషనర్ వల్ల రూంలో వేడి అతి తక్కువగా వుంటుంది గనక, దాని ప్రభావం చాలా ఆల స్యంగా జరుగుతుంది!''

''ఓ.కే! మనం అనుకున్న ప్రకారం అంతా సవ్యంగా జరిగితే మంచిదే. ఖర్మగాలి ఏదైనా ముప్పు ముంచుకొస్తే ఎలా ఎదుర్కోవాలి? అడిగేడు సుందర్ సింగ్.

అంబాదాస్ పలకలేదు. జేబులో చెయ్యిపెట్టి, నెమ్మదిగా పిస్తోలు బైటికి తీసి, ''ఇలా!'' అన్నాడు.

''అంటే, మేమక్కడ రక్తపాతం జరపడానిక్కూడా వెనకంజ వెయ్యొద్దంటావ్?''

అంబాదాస్ నవ్వి-''రక్తపాతం జరపడం నీకు కొత్త కాదుకదా? ఆఁ, ఇప్పటికే రాత్రి చాలా పొద్దుపోయింది. వెళ్ళి పడుకోండి. రేపుదయం తొమ్మిదిగంటలకల్లా వచ్చెయ్యండి. ఒకసారి అన్ని విషయాలూ మళ్ళీ చర్చించుకోవచ్చు'' అన్నాడు.

అందరూ లేచి నిల్చున్నారు. వాళ్ళతోబాటు లేచిన కర్ణన్ వైపు చూస్తూ కన్నుగీటి, కూర్చోమని సైగచేశాడు అంబాదాస్.

మిగతా వాళ్ళు గుడ్ నైట్ చెప్పి వెళ్ళిపోయారు.

కర్ణన్ తిరిగి కుర్చీలో కూర్చుని, ప్రశ్నార్థకంగా చూసేడు.

"నీ మోటర్ సైకిల్ తెచ్చావా ఇక్కడికి?"

"ఔను! బైట వుంది" అన్నాడు కర్ణన్.

"గుడ్! నువ్వు నా వెంట రావాలి!"

"ఎక్కడికి?"

"గ్యారేజ్‌లో నా పాత అంబాసిడర్ వుంది. దాంట్లో నేనొక్కణ్ణీ బైలుదేరతాను. నువ్వు నీ మోటర్ సైకిల్ మీద నా వెనక రా! అక్కడే చెబుతాను" అన్నాడు అంబాదాస్ రహస్యంగా.

కర్ణన్ తలూపి లేచాడు.

చేతి గడియారంవైపు చూసుకున్నాడు అంబాదాస్. రాత్రి పన్నెండు గంటలు!

కర్ణన్ని పదమన్నట్లు సైగ చేసి, తలుపు తెరుచుకుని బైటికి నడిచేడు.

కొద్ది నిమిషాల్లోనే రెండు వాహనాలూ మద్రాసు నగరందాటి, నిర్మానుష్యమైన మహాబలిపురం రోడ్డుమీద పరుగులు తియ్యసాగేయి.

అరగంట తరవాత, అంబాదాస్ తన అంబాసిడర్ కారును రోడ్డుమీంచి కుడివైపు దింపి, ముందుకు పోనిచ్చాడు. దాని వెనకే మోటర్ బైక్ కూడా దిగింది.

అలా దాదాపు మైలుదూరం నడిచేయి రెండు వాహనాలు. అక్కణ్ణించి రాళ్ళూ రప్పలూ, చెట్లూ, దట్టమైన పొదలూ ప్రారంభమయ్యాయి.

ఆ ఎగుడుదిగుడు నేలమీద మోటర్ బైక్ నడపడం చాలా కష్టంగా వుంది కర్ణన్‌కి.

అంతలో అంబాసిడర్ ఓ దట్టమైన పొద ముందాగింది. కారు హెడ్ లైట్స్ వెలుగులో ఆ పొద-చెట్లూ చేమలూ విడదీసి, ఓ గుహలా రూపొందించబడున్నట్లు గమనించాడు కరణ్.

ఇప్పుడు కారు నత్తనడక నడుస్తూ ఆ పొదలోకి దూరింది.

అంబాదాస్ కారు దిగి, "కరణ్!" పిల్చాడు.

మోటర్ బైక్ ఇంజన్ ఆఫ్ చేసి, స్టాండు వేసి, అతన్ని సమీపించాడు కరణ్. అంబాదాస్ మౌనంగా కారు డిక్కీ తెరిచాడు. అందులో నింపివున్న సామాను చూడగానే కరణ్ కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

"నువ్వా బెడ్ హోల్డాల్ మోసుకురా! నేనీ సూట్‌కేస్ తెస్తాను" అన్నాడు అంబాదాస్ సూట్‌కేస్ అందుకుంటూ.

కరణ్ మారు మాటాడకుండా పెద్దసైజు బెడ్ హోల్డాల్ అందుకుని అతన్ననుసరించేడు. అంబాదాస్ కారు ముందుకెళ్ళి, గబగబ అక్కడున్న చెట్ల కొమ్మల్ని అటూ ఇటూ జరపసాగేడు.

మరుక్షణం అక్కడో సొరంగమార్గం ఏర్పడింది.

లోపల కారుచీకటి! అంబాదాస్ టార్చి తీసి వెలిగించి, లోన అడుగుపెట్టాడు.

దిగ్భ్రాంతితో తల మునకలౌతూ అతన్ని అనుసరించాడు కరణ్. లోపల విశాలమైన గుహలాటి శుభ్రమైన ప్రదేశం వుంది.

అంబాదాస్ ఆ సూట్‌కేస్‌ని ఓ మూల పెట్టి, "నువ్వెళ్ళి డిక్కీలో వున్న మిగతా సామాను పట్రా! నేను హృద్రోగిని, బరువు మోయలేను" అన్నాడు.

బెడ్ హోల్డాల్ కిందపడేసి, గుహ బైటికి నడిచేడు కరణ్. రెండు ట్రిప్పుల్లో డిక్కీలోని సామానంతా లోనికి తెచ్చాడు.

"ఈ ఏర్పాట్లన్నీ దేనికో అర్థమైందా?" అడిగాడు అంబాదాస్.

"అదే అర్థంగాక చస్తున్నాను. త్వరగా చెప్పు!"

"బ్యాంకు దోపిడీ జరగ్గానే, పోలీసులు మనకోసం మద్రాసంతా వేటకుక్కల్లా గాలిస్తుంటారు. దోపిడీ జరిగిన మరుక్షణం, స్టేషన్ వ్యాగన్‌లో నేనిక్కడికి వచ్చి, ఆ వాహనాన్ని మరో కంటికి కనిపించకుండా పొదల్లో దాచేస్తాను.

నెల రోజులు అష్టకష్టాలుపడి నేనొక్కణ్ణీ తయారు చేసిన రహస్య స్థావరమిది. డబ్బుతోసహా మనమిక్కడ నెలరోజులు నిశ్చింతగా దాక్కోవచ్చు. ఆలోగా పోలీసుల హడావుడి కాస్త తగ్గిపోతుంది.

ఆ తరవాత మన ఉనికికూడా వుండదీ చుట్టుప్రక్కల! ఏమంటావ్?" అడిగేడు.

తలూపేడు కరణ్, సాలోచనగా.

"వెరీగుడ్! ఇక పద!" అంటూ గుహలోంచి బైటికి వచ్చేడు అంబాదాస్.

2

మధ్యాహ్నం సరిగ్గా రెండుగంటల ఇరవై నిమిషాలకి స్టేషన్ వ్యాగన్ వచ్చి, నేషనల్ బ్యాంక్ వెనక గేటు ముందాగింది.

ఆ చప్పుడుకు తన చెక్క కుటీరంలో కూర్చుని సేద దీర్చుకుంటున్న వాచ్‌మెన్, చెక్‌పోస్ట్ కిటికీగుండా గేటు వైపు చూసాడు.

ముదురునీలం రంగులోవున్న ఆ వ్యాగన్ కిరుప్రక్కలా ఐ.బి.ఎమ్ అన్న పెద్దపెద్ద అక్షరాలు కనిపించేయి.

వ్యాన్ వెనక తలుపు తెరుచుకుంది. కంపెనీ యూనిఫాంలోవున్న కర్ణన్ దిగి, చకచక అడుగులు వేసుకుంటూ వాచ్ మెన్ దగ్గరికి వచ్చేడు.

"లోపల వాల్ట్ రూంలో కంప్యూటర్ చెడిపోయిందని మా కంపెనీకి ఫోన్ చేసి చెప్పారు మేనేజర్! కొత్త కంప్యూటర్ తీసుకొచ్చాం!" అంటూ జేబులోంచి డెలివరీ చలాన్ తీసి వాచ్ మెన్ కందించాడు.

ఆ చలాన్ ఫారం అందుకుని పరిశీలించేడు వాచ్ మెన్. అంతా సరిగ్గానే వుంది!

అంబాదాస్ ఎంతో నేర్పుతో ఐ.బి.ఎమ్ కంపెనీనించి ఆ ఫారం కాజేసి, ఏమాత్రం అనుమానం రాకుండా ఫిలప్ చేసి, దాన్ని తయారుచేశాడు మరి!

సాలోచనగా తలూపుతూ, స్టాండుమీది టెలిఫోన్ అందుకున్నాడు వాచ్ మెన్. అప్పుడు ప్రారంభమయింది కర్ణన్ గుండెలో దడ! వాచ్ మెన్ వాల్ట్ రూంకు ఫోన్ చేస్తున్నాడు కంప్యూటర్ నిజంగా చెడిపోయిందా? లేదా? తెలుసుకోడానికి.

ఖర్మకాలి లోపల అబ్రాహాం పని ఇంకా పూర్తి కాకుంటే, తమ ప్లాన్ ఆదిలోనే పట్టికొట్టి, అందరూ జైల్లో ప్రభుత్వ అతిథ్యం స్వీకరించక తప్పదు!

వాచ్ మెన్ ఫోన్లో మాట్లాడి, రిసీవర్ క్రెడిల్ చేశాడు. ఊపిరి బిగబట్టి ప్రశ్నార్థకంగా చూసాడు కర్ణన్ అతని వైపు.

"నిజమే! కంప్యూటర్ పని చెయ్యడం లేదుట!" అంటూ ప్రక్కనున్న రిజిస్టర్ తెరిచాడు వాచ్ మెన్.

అందులో ఆ డెలివరీ చలాన్ నెంబరూ వగైరా నోట్ చేసుకుని, చలాన్ ఫారంమీద క్లియరన్స్ ముద్ర వేశాడు.

కుదుటపడ్డ మనసుతో వ్యాన్ వైపు అడుగులు వేస్తూ, "కంప్యూటర్ బైటికి తియ్యండి!" అన్నాడు కర్ణన్ బిగ్గరగా.

మరుక్షణం వ్యాన్ లోంచి సుందర్ సింగ్, రజాక్ కిందికి దూకి, కార్డ్ బోర్డ్ పెట్టె ఇవతలికి లాగేరు. దాన్ని జాగ్రత్తగా మోస్తూ గేటుగుండా కాంపౌండ్ లోకి వచ్చారు.

"లోపలికి తీసికెళ్ళండి!" అంటూ తిరిగి వాచ్ మెన్ దగ్గరికెళ్ళి నిల్చున్నాడు కర్ణన్.

సుందర్ సింగ్, రజాక్ పెట్టె మోసుకుంటూ బ్యాంకు బ్యాక్ డోర్ వైపు బైలుదేరారు. వ్యాన్ లో స్టీరింగ్ ముందు కూర్చుని, పక్కిన పేనులా ఇదంతా చూస్తున్నాడు అంబాదాస్.

వాచ్ మెన్ తో కబుర్లలోకి దిగేడు కర్ణన్!

3

సుందర్ సింగ్, రజాక్ లు లోపలికెళ్ళి అప్పుడే అర గంట కావస్తోంది.

పథకం ప్రకారం ఈపాటికి వాల్ట్ లోపల వాళ్ళ పని పూర్తి కావాలసింది. ఇంకా దేనికి రాలేదు? కొంపదీసి లోపలేదైనా ప్రమాదం జరగలేదు కదా?

బైట వాచ్ మెన్ తో మాట్లాడుతూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు కర్ణన్. అతని కళ్లు మాటిమాటికీ బ్యాంకు తలుపువైపు మళ్ళుతున్నాయి ఓరగా.

ఐదు నిమిషాల తరవాత అతని కళ్ళు తళ తళ మెరి శాయి.

కారణం, పెట్టె మోసుకుంటూ సుందర్ సింగ్, రజాక్ లు డోర్ గుండా కాంపౌండ్ లోకి వస్తున్నారు!

"పని అయిపోయిందా?" అడిగాడు అర్థవంతంగా.

రజాక్ తలూపి, "ఐపోయింది!" అన్నాడు కన్ను గీటుతూ.

సేషన్ వ్యాగన్ డ్రైవింగ్ సీట్లో—ఊపిరి బిగబట్టి ఎదురుచూస్తున్న అంబాదాస్ వెంటనే ఇంజన్ స్టార్ట్ చేసి రెడీగా కూర్చున్నాడు.

కర్ణన్ ముందుకెళ్ళి, పెట్టె మోయడంలో వాళ్ళకు సాయం పట్టేడు. ముగ్గురూ గబగబ పెట్టెని సేషన్ వ్యాగన్ లో లోడ్ చేసి, తలుపు మూయబోయారో లేదో, సరిగ్గా అదే క్షణంలో బ్యాంకులోంచి ఫుల్ సూటులో వున్న ఓ వ్యక్తి ఇవతలికి వచ్చేడు.

మొట్టమొదటిసారి అంబాదాస్ దృష్టి పడింది అతని మీద! ఆ వ్యక్తి ఎవ్వరో కాదు. అక్షరాలా ఆ బ్యాంకు మేనేజర్ ప్రసాదరావు!!

అంబాదాస్ తన అనుచరుల కతని గురించి హెచ్చ రించేలోగా, మేనేజర్ వ్యాన్ని సమీపించి, "ఎవరు మీరు? ఏమిటిదంతా?" అడిగేడు నోరు తెరుస్తూ.

ఆ నలుగురి గుండెలూ గుభిల్లుమన్నాయి! క్షణంపాటు ఏం జవాబివ్వాలో తోచలేదు.

కర్ణన్ వెంటనే అందుకుని, "మేము ఐ.బి.ఎమ్ కంపెనీ వర్కర్లం సార్! బ్యాంకులో కంప్యూటర్ చెడిపోతే కొత్త కంప్యూటర్ తెచ్చి, పాత కంప్యూటర్ తీసి కెళ్తున్నాం!" అన్నాడు ఇకిలిస్తూ.

"ఏమిటీ, ఈ పెట్టెలో పాత కంప్యూటరుందా?"
"ఔనండి!"

"మిమ్మల్నెవరు పిలిపించా రిక్కడికి?"
"బ్యాంకు మేనేజరుగారు!"

అంబాదాస్ గుండె గతుక్కుమంది. ఆ ముగ్గుర్లో ఎవ్వరూ ఇదివరకు ఆ మేనేజర్ని చూళ్ళేదు. అంతా సజావుగా జరిగి, చివరి క్షణంలో ప్లాన్ పిల్లిమొగ్గ వేస్తోంది. చడీ చప్పుడూ కాకుండా వ్యాగన్ని ఫస్ట్ గేర్ లో వేశాడు అంబాదాస్.

"ఆ పెట్టె తెరవండి!" అరిచాడు మేనేజర్.

సుందర్ సింగ్ పరిస్థితి వికటిస్తోందని పసిగట్టేశాడు. మేనేజర్ కన్నుగప్పి మెల్లిగా వ్యాన్ చాటుకు జరిగేడు. జేబులోంచి రివాల్వర్ తీసి, దాని సేఫ్టీ కాచ్ వెనక్కి లాగి, రెడీగా నిల్చున్నాడు.

కర్రన్ తటపటాయిస్తూ వ్యాన్ లోపలున్న పెట్టెపైన చెయ్యి వేశాడు. అంతే! మేనేజర్ గుండెకు గురిచూసి, ట్రిగ్గర్ నొక్కేడు సుందర్ సింగ్.

"ఢాం" అన్న శబ్దంతో పరిసరాలు మారుమోగడం, మేనేజర్ గుండె పట్టుకుని కింద కూలడం ఒకేసారి జరిగాయి.

సరిగ్గా అదే క్షణంలో, డ్రైవింగ్ సీట్లో కూర్చున్న అంబాదాస్ క్లచ్ రిలీజ్ చేసి, ఆక్సిలేటర్ని నొక్కేడు బలంగా.

అంతే! తుపాకి గుండులా అక్కణ్ణించి దూసుకు పోసాగింది వ్యాన్.

మిగతా ముగ్గురూ దిగ్భ్రాంతితో అటే చూస్తుండి పోయారు కాసేపు. అంబాదాస్ తన అనుచరుల్ని మృత్యుముఖంలో వదిలేసి, పారిపోతున్నాడు.

అంతవరకూ తన చెక్‌పోస్ట్‌లో కూర్చుని ఇటే చూస్తున్న వాచ్‌మెన్ మేనేజర్‌గారు ఆ కంపెనీ వర్కర్లతో ఏదో మాట్లాడుతున్నారనుకున్నాడు. కాని, హఠాత్తుగా పిస్తోలు పేలడం, మేనేజర్ గుండె పట్టుకుని కింద కూలడంతో పరిస్థితి అర్థమైపోయిందతనికి.

మరుక్షణం ఓ మూల నిలబెట్టివున్న డబుల్ బారల్ తుపాకి వచ్చేసిందతని చేతిలోకి. అదే క్షణంలో గేటు దగ్గర్నించి స్టేషన్ వ్యాన్ బాణంలా దూసుకుపోవడం కనిపించింది.

అప్పుడు పడింది వాచ్‌మెన్ దృష్టి సుందర్‌సింగ్ మీదా, అతని చేతిలోవున్న పిస్తోలుమీదా! మరేమీ ఆలోచించకుండా, కిటికీ అంచుపై తుపాకి ఆనించి, సుందర్‌సింగ్‌ని గురిచూసి ట్రిగ్గర్ నొక్కేడు.

"ఢాం!" మనే శబ్దంతో దూసుకెళ్ళి సుందర్‌సింగ్ కణతలో దిగింది గుండు. అతను కాండం నరికిన చెట్టులా కూలిపోయేడు.

వాచ్‌మెన్ వెంటనే మరోసారి ట్రిగ్గర్ నొక్కేడు.

ఈసారి గురితప్పింది! అంతే—

ఎక్కుపెట్టి వదిలిన బాణాల్లా అక్కణ్నించి పరుగు తీశారు కర్ణన్, రజాక్‌లు.

రెండు నిమిషాల్లో బ్యాంకు పరిసరాలు దాటి, మేన్‌రోడ్ మీదికి వచ్చేరు. అదృష్టవశాత్తూ కనిపించింది ఓ ఖాళీటాక్సీ!

బాక్‌సీట్లో దూకుతూ, "మాంబళం పోనివ్!" అన్నాడు కర్ణన్.

4

వాల్టరూం ఏర్‌కండిషనర్ స్విచ్ తిరిగి ఆన్ జేసి, తేలిగ్గా వూపిరి తీసుకున్నాడు అబ్రాహాం!

తన పని అంతవరకే. ఈ పాటికి అక్కడ జరగవలసిం దంతా జరిగిపోయుంటుంది.

ఇహ ఒక్క క్షణం తనిక్కడుండకూడదు. టూల్ బాక్స్ అందుకుని గదిలోంచి బైటపడి నడవాలో అడుగు పెట్టాడు.

సరిగ్గా అదే క్షణంలో పక్క గదిలోంచి బైటికి వచ్చిన ఓ క్లర్కు అతన్ని చూడగానే చటుక్కున ఆగి, "నువ్వు ఎలక్ట్రిషియన్‌వి కదూ?" అడిగేడు.

తలూపాడు అబ్రాహాం!

"మా సెక్షన్లో ట్యూబ్ లైట్ సరిగ్గా వెలగడంలేదు. కాస్త చూసివెళ్ళు!"

అబ్రాహాం గుండె గతుక్కుమంది. ఆలస్యం, అమృతం, విషం! తనిక్కణ్నించి ఎంత త్వరగా బైటపడితే అంత మంచిది. రానంటే క్లర్కు కనుమానం వేస్తుంది. ఏమిటి చెయ్యడం?

"ఐదు నిమిషాల్లో వెళ్ళిపోదువుగాని రా!" అన్నాడు క్లర్కు మళ్ళీ.

గత్యంతరంలేదు. మనసులో అతన్ని సవాలక్ష శాప నార్థాలు పెడుతూ "పదండి!" అన్నాడు నీరసంగా.

క్లర్కు అతన్ని పక్క గదిలోకి తీసికెళ్ళి, పైన వేళాడుతున్న ట్యూబ్ లైట్ చూపించేడు. అబ్రాహాం బల్లమీద ఎక్కి చకచక దాని స్టార్టర్ చెక్ జెయ్య సాగేడు.

పని పూర్తికావడానికి పది నిముషాలు పట్టింది.

'హమ్మయ్య' అనుకుంటూ బల్ల దిగాడో లేదో, బ్యాంకు వెనక తుపాకి పేలిన శబ్దం వినిపించింది. అబ్రాహాం గుండెలో గుర్రాలు దౌడు ప్రారంభించేయి.

"ఏమిటా చప్పుడు?" అన్నాడో క్లర్కు ఆశ్చర్యంగా.

అబ్రాహాం వెంటనే అందుకుని—"ఏదో కారు బ్యాక్ ఫైరింగ్ జరిగుంటుంది లెండి..." అన్నాడు.

"కాదు! తుపాకి ప్రేలుడులా వినిపించింది!" అన్నాడు మరో క్లర్కు.

అబ్రాహాం ఇంకా ఏదో చెప్పబోతుండగా, రెండో సారి మళ్ళీ వినిపించింది తుపాకి గర్జన!

"సందేహం లేదు! వెనక కాల్పులు జరుగుతున్నాయి. గూర్ఖా వెంటనే ఫ్రంట్ డోర్ మూసెయ్! నేను పోలీసులకి ఫోన్ చేస్తున్నాను..." అరిచాడో క్లర్కు.

అబ్రాహాం గుండెలో బండలు దొర్లుతున్నాయి. గూర్ఖా ఫ్రంట్ డోర్ మూసేశాడంటే, తన గతి బోనులో పడ్డ ఎలికలా అయిపోతుంది. వెంటనే ఇక్కణ్ణించి బైట పడాలి. టూల్ బాక్స్ అందుకుని, గబగబ గది దాటి ఫ్రంట్ డోర్ వైపు నడిచేడు.

అనుమతి లేకుండానే అతని కుడిచెయ్యి పిస్తోలువున్న జేబులోకి దూరి సిద్ధంగా వుంది! అప్పటికే అక్కడ కూర్చుని పనిజేస్తున్న బ్యాంకు సిబ్బంది కూడా హడావుడిగా తమ సీట్లలోంచి లేవసాగేరు. గూర్ఖా సింహద్వారం మూసేస్తున్నాడు.

అబ్రాహాం పెద్దపెద్ద అంగలతో అతన్ని సమీపించి, "నేను ఎలక్ట్రీషియన్ని! ప్లీజ్ నన్ను బైటకెళ్ళనివ్వు" అన్నాడు ప్రాధేయపడుతూ.

గూర్ఖా అతన్ని ఎగాదిగా చూసి, "ఎవ్వరూ బైటి

కాల్చడానికి వీల్లేదు." అన్నాడు ఖచ్చితంగా.

ఎక్కువ ఆలోచించడానికి వ్యవధిలేదు. కుడిచెయ్యి బైటికితీశాడు అబ్రాహాం! మరుక్షణం ఆ చేతిలోని పిస్తోలు పొగలు కక్కుతూ గర్జించింది!

గుండు తిన్నగా వెళ్ళి గూర్ఖా భుజంలో దిగింది. అతన్ని ఒక్క తోపుతోసి, అప్పటికే సగం మూసుకున్న తలుపు తెరుస్తూ పరుగు లంకించాడు బైటికి!

లోపల గగ్గోలు ప్రారంభమైంది!

అదృష్టవశాత్తూ బ్యాంకు కాంపౌండ్‌లో పార్కు జేసి వున్న ఫియట్ కారుమీద పడింది అబ్రాహాం దృష్టి. మెరుపులా దాడు దీశాడు.

తలుపు దగ్గర గాయపడ్డ గూర్ఖా అంత బాధనూ లెక్కచెయ్యకుండా, తన రైఫిల్ అందుకుని, కారు దగ్గరికి పరిగెత్తుతున్న అబ్రాహాం వైపు ఫైర్ జేశాడు.

కారు ఫ్రంట్ డోర్ తెరిచి లోపల దూరబోతున్న అబ్రాహాంకు, కణకణలాడే ఎర్రని నిప్పుకణం ఏదో రివ్వున దూసుకువచ్చి తన పక్కటెముకల్లో దిగినట్టు తోచింది. కింద పడబోతూ నిలదొక్కుకుని, ఊపిరి బిగబట్టి శక్తినంతా కూడదీసుకుని, డ్రైవింగ్ సీట్లో కూలబడ్డాడు.

అదృష్టంకొద్దీ ఇగ్నీషియన్ రంధ్రంలో తాళంచెవి అలాగే వేళాడుతోంది. వెంటనే ఇంజన్ స్టార్ట్ జేసి, కారు ముందుకు పోనిచ్చాడు. గేటు దాటగానే ఎడం వైపు తిప్పి వేగం హెచ్చించాడు.

గుండు జేసిన రంధ్రం గుండా రక్తం స్రవిస్తూ అతని షర్టు తడిసిపోతోంది. మస్తిష్కంలో ఏదో మత్తు కమ్ముకుంటున్నట్టు తోస్తోంది. తను మూర్ఛపోకూడదు.

పళ్లు బిగబట్టి బాధను ఓర్చుకుంటూ, స్టీరింగ్ కంట్రోల్ చేస్తున్నాడు.

కారు బాణంలా దూసుకుపోతోంది మాంబళంవైపు!

5

అంబాదాస్ తన రహస్య స్థావరానికి సురక్షితంగా చేరుకున్నాడు.

పొదలతో కప్పివున్న ఆ గుహ చేరువలో వ్యాన్ ఆపి దిగాడు.

తన అదృష్టాన్ని లోలోపలే అభినందించుకుంటూ వ్యాన్ వెనక్కి వెళ్ళి, బ్యాక్ డోర్ తెరిచి, లోపలున్న పెట్టె మూత ఊడబెరికి ఆత్రంగా చూశాడు.

దాని పీకలదాకా పేర్చివున్న నోట్లకట్టలు కనిపించగానే అతని కళ్ళు జిగేల్మన్నాయి! చిన్నగా నవ్వుకుంటూ చేత్తో ఆప్యాయంగా ఆ నోట్లని నిమిరేడు.

తన ప్లాన్ ఫుల్ సక్సెస్ అయింది. చివర్లో బ్యాంకు మేనేజర్ రావడంవల్ల కొద్దిగా బెణికిన మాట నిజమే గానీ, దానివల్ల తనకు జరిగిన నష్టమేమీ లేదు. మేనేజర్ వచ్చినా, రాకున్నా పెట్టె వ్యాన్‌లో చేరిన మరుక్షణం మిగతా వాళ్ళని అక్కడే వదిలి తను పారిపోయేవాడు.

వాళ్ళు మేనేజర్ని కాల్చి చంపడం ఒకందుకు మంచిదే అయింది. తను రియర్‌వ్యూ మిర్రర్‌లోంచి స్పష్టంగా చూసేడు, సుందర్‌సింగ్ వాచ్‌మెన్ తుపాకి గుండుకు బలికావడం! మిగతా వాళ్ళుకూడా అలాగే చస్తే పీడా విరగడవుతుంది!

ఈ రహస్య ప్రదేశం తెలిసిన వ్యక్తి కరన్ ఒక్కడే! మిగిలిన ముగ్గురూ అక్కణ్ణించి ప్రాణాలతో బయట పడితే ఇక్కడికి వస్తారు.

రాగానే వాళ్లని కిక్కురుమనకుండా కైలాసం పంపి, పొదల్లో రెడీగా వున్న కార్లో, డబ్బుతో ఎటైనా చెక్కెయ్యాలి. శత్రుశేషం వుంచుకోకూడదు. ఆలోచిస్తూ పెట్టెమూత యథాతథంగా మూసేసి, దాని రెండు కొసలూ పట్టుకుని లాగేడు అంబాదాస్.

అది అంగుళం కూడా కదల్లేదు. పెట్టె యింత బరువుంటుందనుకోలేదతను.

ఈసారి కాస్త గట్టిగా పట్టుకుని ఒక్క ఊపుతో లాగేడు తనవైపు.

పెట్టె కొద్దిగా కదిలింది. కాని, ఆ ఊపువల్ల హఠాత్తుగా అతని గుండెలో నెప్పి ప్రారంభమైంది. చేతులు అప్రయత్నంగా పెట్టెని వదిలేసి, గుండెమీదికి వచ్చేయి.

ఆ నెప్పిగురించి అతనికి బాగా తెలుసు. గత నాలుగేళ్ల నించీ హృద్రోగంతో బాధపడుతున్నాడు అంబాదాస్. ఏ కాస్త ఎక్సైట్‌మెంట్‌కు గురైనా, ఏమాత్రం ఎక్కువ బరువు లేపడానికి ప్రయత్నించినా అలాగే వస్తుంది గుండెపోటు!

ఛాతీ అదుముకుంటూ కాసేపు కింద కూర్చుండిపోయాడు.

గంట తరవాతగానీ ఆ నెప్పి కాస్త స్థిమిత పడ్డట్టనిపించలేదు. ఇహ ఆ పెట్టి ఎత్తడం చాలా ప్రమాదం!

నెమ్మదిగా లేచి నిల్చుని, జేబులోంచి స్టేషన్ వ్యాగన్ తాళం చెవులు తీశాడు. వాటితో వ్యాన్ తలుపులన్నీ లాక్ చేసి, అడుగులో అడుగు వేసుకుంటూ పొదలవైపు నడిచేడు.

అతి కష్టంమీద కొమ్మలూ, రెమ్మలూ తొలగించుకుంటూ గుహలో ప్రవేశించేడు.

ఇప్పుడు తనకు పూర్తిగా రెస్టు కావాలి. జేబులోంచి రెండు కాంపోజ్ మాత్రలు తీసి, మింగి, నెమ్మదిగా బెడ్ హోల్డాల్ విప్పి కింద పరిచేడు.

మాత్రలు మింగడంవల్ల నెప్పి రవంత ఉపశమనం కలిగిస్తోంది.

పక్కమీద వాలి, కళ్ళు మూసుకున్నాడు అంబాదాస్.

6

"ఇక్కడ ఆపు!" అన్నాడు కర్ణన్ టాక్సీ డ్రైవర్‌తో.

వీధి మొదట్లో ఆగింది టాక్సీ. కర్ణన్ పర్సుతీసి మీటర్ బిల్ యిచ్చేశాడు.

టాక్సీ వెళ్ళిపోయేవరకూ అక్కడే వుండి, గబగబ అడుగులు వెయ్యసాగేరు అంబాదాస్ ఇంటివైపు.

"ఆ రాస్కెల్ మనల్ని చవటల్ని చేసి, డబ్బుతో పారిపోయాడు" అన్నాడు రజాక్ పళ్ళు నూరుతూ.

"వాడిమీద దేనికి విరుచుకుపడతావ్?"

"లేకుంటే ఏమిటి? మనందర్నీ సుడిగుండంలో వదిలేసి, వాడు డబ్బుతో పారిపోవడం న్యాయమేనంటావా?"

"ఔను! అంబాదాస్ సమయానికి చాలా తెలివిగా ప్రవర్తించేడు. ఆ పరిస్థితిలో సాధ్యమైనంత త్వరగా ఆ డబ్బును ఆ పరిసరాలకి దూరంగా తీసికెళ్ళడమే సరైన పని.

ప్రమాదాల నెదుర్కోవడం మనకు కొత్తకాదు. మనం సులభంగా అక్కణ్ణించి తప్పించుకోగలమని వాడికి తెలుసు. అందుకే, నిశ్చింతగా వుడాయించాడు. వాడి అంచనా ప్రకారం మనం నిక్షేపంగా బైటపడ్డామా, లేదా?" అన్నాడు కర్ణన్.

"మనమైతే బైటపడగాలిగాం గానీ, పాపం సుందర్ సింగ్ పుణ్యానికి ప్రాణాలు పోగొట్టుకున్నాడు."

"ఏం చేస్తాం చెప్పు! ఎవ్వడి చావు ఎప్పుడు ఎలా రాసిపెట్టుందో ఎవరు చెప్పగలరు? ఒకరోజు మనమూ పోయేవాళ్ళమే గదా?" అన్నాడు కర్ణన్ వేదాంతిలా.

అంబాదాస్ ఇల్లు వచ్చేసింది.

గేటుగుండా కాంపౌండ్‌లో ప్రవేశించి ఆశ్చర్యపోయారిద్దరు.

ఎడంవైపు గోడవారగా పార్క్ చేసుందో ఫియట్ కారు!

"కొంపదీసి పోలీసులు కాదు కాదా?" అన్నాడు కర్ణన్ ఖంగారుగా.

"తెలివితక్కువగా మాట్లాడక! పోలీసు లెక్కడైనా కార్లో వస్తారా?"

"మరీ కారెవరిది?"

"నాకేం తెలుసు? లోపలికెళ్ళి చూస్తేగానీ తెలీదు."

ఇద్దరూ మూసున్న తలుపుముందాగి, చెవులు రిక్కించుకున్నారు. లోపలినుంచి సన్నగా ఎవరో మూలుగుతున్న శబ్దం వినిపిస్తోంది!

మెల్లిగా తలుపుతట్టాడు రజాక్.

"ఎవరు?" అడిగిందో కంఠం ఆయాసపడుతూ.

అది అబ్రాహాం కంఠం!

ఇద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

"మేము! తలుపు తెరువ్!" అన్నాడు కర్ణన్.

"త్... తెరిచే వుంది... తొయ్యండి!"

తలుపు తోశాడు రజాక్!

ఎదురుగా కనిపించిన దృశ్యం వాళ్ళని చకితుల్ని

చేసింది. నేలమీద రక్తసిక్తమైన బట్టలతో పడున్నాడు అబ్రాహాం!

"ఏమిటిది? ఎలా జరిగింది?" అంటూ అతని దగ్గరికి పరిగెత్తారిద్దరూ.

జరిగింది క్లుప్తంగా వివరించాడు అబ్రాహాం.

రజాక్ గబగబ బెడ్ రూంలోకెళ్ళి, కత్తితో మంచం మీది పరుపును కొద్దిగా కోసి, దాంట్లోంచి దూదిలాగి, ఓ తెల్లదుప్పటందుకుని వచ్చాడు. కర్ణన్ ఆ దూదితో అబ్రాహాం గాయాన్ని శుభ్రంగా తుడిచేసి, తెల్లదుప్పటి చింపి గాయానికి కట్టుకట్టేడు.

"గుండు పక్కటెముకల్లో ఇరుక్కుంది! సలుపుతోంది!" అన్నాడు అబ్రాహాం ఆయాసపడుతూ.

"ఓర్చుకోవాలి. తప్పదు. ఇక్కడికి డాక్టర్ని పిలవడం' కోరి ప్రమాదాన్ని కొనితెచ్చుకోవడ మౌతుంది!" అన్నాడు కర్ణన్.

ఇద్దరూ అతన్ని ఎత్తి, బెడ్ రూంలోకి తీసికెళ్ళి మంచంమీద పడుకోబెట్టారు. అబ్రాహాం కళ్ళు మూసుకున్నాడు అసహనంగా.

"నా బుర్ర మొద్దుబారిపోతోంది కర్ణన్! కడుపులో కాస్త కాఫీ నీళ్ళు పడితేగానీ మామూలు మనిషినయ్యేలా లేను. పద, ముందు కాఫీ చేద్దాం!" అన్నాడు రజాక్.

ఇద్దరూ వంటింట్లోకెళ్ళి, డబ్బాలూ అవీ వెదికారు.

అన్నీ ఖాళీ! నువ్వు గింజ కూడా లేదు! ఈ రోజు తాము ఎలాగైనా ఇక్కడే తలదాచుకోవాలి. పోలీసుల సందడి తగ్గాక రేపు వీలుచూసుకొని ఆ రహస్య ప్రదేశానికి చేరుకోవచ్చు.

సాలోచనగా తలూపుతూ జేబులోంచి తర్సు తీశాడు

కర్ణన్. "బైట అబ్రాహాం తెచ్చిన ఫియట్ కారుంది. దానిమీద ఎవ్వడి దృష్టీ పడకముందే, ఎక్కడైనా వదిలి రావాలి. ఇంట్లో మింగ మెతుకులేదు. నా దగ్గర టాక్సీ బాడుగకు పోను, ఇంకా ముప్పై రెండు రూపాయలు మిగి లాయి. నీ దగ్గరెంతుంది?"

రజాక్ జేబులోంచి డబ్బుతీసి లెక్కపెట్టి, "నలభై ఎనిమిది రూపాయలు!" అన్నాడు.

"వెరీగుడ్! ఈ డబ్బంతా తీసికెళ్ళి, కారెక్కడైనా వదిలేసి, వారానికి సరిపడే డ్రైఫుడ్ తీసుకురా. సిగ రెట్లూ, అగ్గిపెట్టెలూ మరవక! అన్నట్టు ఓ క్వార్టర్ బాటిల్ బ్రాండీ కూడా పట్రా. మనకోసం కాదు. అబ్రాహాం కోసం! కనీసం బ్రాండీ తాగైనా ఆ బాధ మర్చిపోతాడు." అన్నాడు కర్ణన్ పర్సు రజాక్ కందిస్తూ.

అతను తలూపి, "కారుతో బాటు ఈ యూనిఫామ్స్ కూడా వదిలేస్తే మంచిది. విప్పేయ్!" అన్నాడు తన యూనిఫాం తీస్తూ.

ఇద్దరూ గబగబ ఆ దుస్తులు విప్పి, తమ పాతబట్టలు తొడుక్కున్నారు. రజాక్ వాటిని చుట్టచుట్టి, చంకలో ఇరికించుకుని బైటికి నడిచేడు.

కర్ణన్ తలుపుమూసి, హాలు మధ్య కుర్చీలో చతికిల బడి, సిగరెట్ కాలుస్తూ తీవ్రాలోచనల్లో మునిగి పోయాడు.

దాదాపు రెండు గంటల తరవాత మోగింది కాలింగ్ బెల్.

"ఎవరు?" అన్నాడు కర్ణన్ జేబులోని పిస్తోలు తడుముకుంటూ.

"నేను రజాక్‌ని!!"

వెళ్ళి గడియ తీశాడు. చేతిలో పెద్ద వెదురు బుట్టతో లోనికి వచ్చాడు రజాక్. పళ్ళూ, ఫలహారాలూ, బ్రెడ్లూ, బిస్కెట్లూ, జామ్ టిన్లూ, కేకులూ, సిగరెట్లూ నిండా వున్నాయందులో.

"బ్రాండి తేలేదా?" అడిగాడు కర్ణన్ ఆశ్చర్యంగా.

రజాక్ తలూపి, బుట్ట అడుగునున్న బాటిల్ బైటికి తీసేడు.

"పద,ముందు అబ్రాహాంకు బ్రాండీ ఇచ్చి, వాడి బాధ మరిపిద్దాం!" అన్నాడు కర్ణన్ బెడ్‌రూం వైపు నడుస్తూ.

తలుపు మూసి, బుట్టతో అతన్ననుసరించేడు రజాక్.

అబ్రాహాం కళ్లు మూసుకుని, వెల్లకిలా పడుకున్నాడు మంచంమీద.

మంచాన్ని సమీపించి, "అబ్రాహాం!"పిల్చేడు కర్ణన్.

అతను పలకలేదు.

"అబ్రాహాం! నీకోసం బ్రాండీ తెప్పించాను. తాగి పడుకో!" అన్నాడు కర్ణన్ మళ్ళీ.

ఐనా, అబ్రాహాం కళ్ళు తెరవలేదు.

ఏదో అనుమానం వేసి, చటుక్కున అతని గుండె మీద చెవి આనించేడు కర్ణన్. "పోయాడు!" అన్నాడు దిగ్భ్రాంతితో.

తన శరీరంలో ప్రవహిస్తున్న రక్తం క్షణంపాటు స్తంభించిపోయినట్టు తోచింది రజాక్‌కు. "ఇప్పుడెలా?" అనగలిగేడు తేరుకుని, అతి కష్టంమీద.

"శవాన్ని ఇలా వుంచామంటే, కుళ్ళి కంపుకొడుతుంది! గత్యంతరం లేదు. పెరట్లో గొయ్యితీసి పాతేద్దాం!" అన్నాడు కర్ణన్ నీరసంగా.

ఇద్దరూ గబగబ ఇల్లంతా వెతకసాగేరు, గొయ్యి తవ్వడానికి ఉపయోగించే వస్తువేదైనా దొరుకుతుందేమో నని. వంట గదిలో పాత సామాను వేసే అటకమీద కనిపించిందో గునపం!

దాన్నందుకుని, "పద పెరట్లోకి!" అన్నాడు కర్ణన్.

7

"ఈ పక్కనించి ఓ షార్ట్‌రూట్ వుంది! అలా వెళ్ళామంటే, మద్రాసు వెళ్ళే మేన్‌రోడ్ చేరుకుంటాం!" అన్నాడు ఆంజనేయులు కారు డ్రైవ్ చేస్తూ భార్యతో.

జగదాంబ పలకలేదు. మూతి మూడొంకర్లు తిప్పి, కూర్చుంది మౌనంగా.

ఆ రోజు ఉదయం మద్రాసునించి భార్యా సమేతంగా తన ఫోర్డ్ కారులో కాంచీపురం వెళ్ళాడు ఆంజనేయులు పిక్నిక్ పేర కాస్త కులాసాగా గడిపివద్దామని. ఐతే, తిరుగు ప్రయాణంలో సగందూరం వచ్చేసరికి చీకటి పడిపోయింది. ఇహ షార్ట్‌రూట్‌లో సాధ్యమైనంత త్వరగా మెయిన్‌రోడ్ చేరడం తప్ప మరో గత్యంతరం కనిపించడం లేదు!

హెడ్‌లైట్స్ కాంతిలో కారును మెల్లిగా రోడ్డు దింపించి, ముందుకు పోనిచ్చాడు. గరగర శబ్దం చేస్తూ గతుకుల్లో పడి మన్ను తిన్న పాములా నడుస్తోంది కారు.

జగదాంబ ఆ చీకాకును మరగడానికి, ఒళ్ళో వున్న బుష్‌బారన్ ట్రాన్సిస్టర్ని ట్యూన్ చెయ్యాలని పట్టువదలని విక్రమార్కుణిలా ప్రయత్నిస్తోంది. కారు కుదుపులవల్ల ఆమె ప్రయత్నం ఫలించడంలేదు.

రేడియో ఆఫ్ చేసి, "నేరకపోయి వచ్చాను మీ వెంట.

ఈ డొక్కు కారు పుణ్యమా అని ఇప్పటికే నా అవయవాలు ఎక్కడికక్కడ కొబ్బరి చట్నీ అయిపోయాయి!" అంది విసుగ్గా.

ఉబికి వస్తున్న కోపాన్ని అతి కష్టంమీద దిగమింగాడు ఆంజనేయులు. ముందుకెళ్తున్న కొద్దీ దారి మరీ దుర్భరంగా తయారవుతోంది. మరీ ఇంత ట్రబుల్ రూట్ అయుంటుందనుకోలేదతను.

అంతలో, హఠాత్తుగా ఎడంవైపు చక్రం తుస్సుమంటూ కూర్చుండిపోయింది. ఆ ఊపుకు "ఓరి దేవుడోయ్!" అంటూ ఓవైపు ఒరిగిపోయింది జగదాంబ.

ఆంజనేయులు డోర్ తెరిచి, అతికష్టంమీద భార్యని ఇవతలికి లాగగలిగేడు.

"అయిందా సంబడం? షార్ట్ రూట్, షార్ట్ రూట్ అంటూ నన్ని కీకారణ్యంలోకి తెచ్చి పడేశారుగదా?" అంది జగదాంబ భర్తమీద విరుచుకుపడుతూ.

"కాసేపు నోరు మూసుక్కూర్చో! ఏదైనా కారు ఈ వైపొస్తే లిఫ్ట్ అడిగి వెళ్దాంగానీ!" అన్నాడు ఆంజనేయులు అసహనంగా.

"అందరూ మీలాగే తెలివిలేనివాళ్ళనుకున్నారా? బుర్రున్నవాడెవ్వడైనా ఈ గతుకుల్లో పడి వస్తాడా చావడానికి? నా ఖర్మగాకపోతేనూ!"

"ఐతే, ఇక ఆర్.టి.సి. బస్సే మనకు శరణ్యం!"

"మీ రిక్కడ ఇరుక్కుపోయారని పాపం, ఆ ఆర్.టి.సి వాళ్ళు మాయా కమండలంలో చూశారుకదూ? వెంటనే పంపిస్తార్లెండి ఓ స్పెషల్ బస్సు."

"అది కాదే, ఇక్కణ్నించి మేన్ రోడ్ చేరుకున్నా

మంటే, మద్రాసు వెళ్ళడానికి ఏదో ఒక వాహనం దొరక్కపోదు!''

''ఆ మేన్ రోడ్ ఎక్కడ తగలడింది?

''బహుశా, మైలుదూరం వుంటుంది!''

''వల్ల కాదు. అంత దూరం నడవడం నావల్ల కాదు.''

ఇక కోపాన్ని దిగమింగ లేకపోయాడు ఆంజనేయులు. ''నడవకపోతే, నిన్ను భుజాన ఎత్తుకెళ్ళమంటావా?... అదుగో, అవతల నక్కలూ, తోడేళ్ళూ అరుస్తున్నాయి!''

ఆ అస్త్రం పనిచేసింది. లీలగా వినిపిస్తున్న నక్కల ఊళలతో ఆమె హడలిపోయి, మారు మాటాడకుండా భర్తకన్నా ముందుగా నడక సాగించింది. లోలోపల నవ్వుకుంటూ ఆమె ననుసరించాడు ఆంజనేయులు.

అలా ఫర్లాంగు దూరం వెళ్ళారో లేదో, ఓ పొదల దగ్గర చటుక్కున ఆగిపోయింది జగదాంబ.

''ఏమైంది?'' అడిగాడు ఆంజనేయులు.

జగదాంబ పలకలేదు. చేత్తో కుడివైపు సైగ చేస్తోంది. చటుక్కున అటుచూసి నోరు తెరిచాడు ఆంజనేయులు.

మసక చీకట్లో ఆ పొదల దగ్గర కనిపించింది ఓ నీలం రంగు స్టేషన్ వ్యాగన్.

''అరె! ఈ వ్యాన్ ఇక్కడికెలా వచ్చింది?'' అన్నాడు ఆశ్చర్యంగా.

''చుట్టు పక్కల ఎవ్వరైనా వున్నారేమో! కేకెయ్యండి!''

రెండుమూడుసార్లు గట్టిగా కేకేశాడు ఆంజనేయులు.

ఎవ్వరూ జవాబివ్వలేదు!

''హమ్మయ్య! ఆ భగవంతుడే నా మొరాలకించి, ఈ వాహనాన్నిక్కడ ప్రత్యక్షం చేసుంటాడు. ఇంజన్

స్టార్టవుతుందేమో చూడండి!'' అంది జగదాంబ ఉత్సాహంగా.

''అనుమతి లేకుండా దీన్ని దొంగలించుకు పోదామనా నీ ఉద్దేశం?''

''ఖర్మ! ఇది దొంగతన మెలా అవుతుంది? అరగంట లోపల మనం మద్రాసు చేరుకుంటాం! తరవాత మన గ్యారేజ్ లోంచి మీరు స్పేర్ వీల్ తీసుకొచ్చి, మన కారుకు బిగించి, దీన్నిక్కడొదిలి, మన కార్లో తిరిగి వచ్చెయ్యండి!''

ఐడియా బాగానే వుంది! సాలోచనగా తలూపుతూ జేబులోంచి తాళంచెవులగుత్తి తీశాడు ఆంజనేయులు. అతను మద్రాసులోని ఓ కార్ల కంపెనీలో టెస్టింగ్ గ్రూప్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాడు.

అతని తాళంచెవుల గుత్తిలో ఓ ప్రత్యేకమైన వెహికల్ మాస్టర్ కీ వుంది. దాంతో ఏ రకం వాహనాల డోర్ లాకైనా సులభంగా తెరవ్వచ్చు. ఏ రకం ఇగ్నిషియన్స్ కైనా ఉపయోగించవచ్చు.

ఆ తాళం చెవితో, ముందు ఫ్రంట్ డోర్ లాక్ తెరిచాడు ఆంజనేయులు, డ్రైవింగ్ సీట్లో కూర్చుని, తాళం చెవి ఇగ్నిషియన్ హోల్లో దూర్చి, సెల్ఫ్ స్టార్టర్ లాగేడు.

ఇంజన్ స్టార్టయింది!

''హమ్మయ్య! మీకు తెలివితేటలున్నాయి సుమండీ!'' అంటూ రోడ్ రోలర్ లాటి తన కాయాన్ని ఫ్రంట్ సీట్లోకి చేర్చింది జగదాంబ.

ఆంజనేయులు వెంటనే ఇంజన్ ఆఫ్ చేశాడు.

''ఎందుకూ?''

"చెబుతానుండు!" అంటూ జేబులోంచి పాకెట్ డైరీ బాల్ పెన్ తీశాడు ఆంజనేయులు.

కేబిన్ లోపల లైటు వెలిగించి, స్టీరింగ్ మీద డైరీ వుంచి గబగబ రాయడం ప్రారంభించేడు.

'నా కారు ఫ్రంట్ టైర్ బర్స్ట్ అయిన కారణంగా, విధిలేక మీ స్టేషన్ వ్యాగన్ తీసికెళ్ళవలసి వస్తోంది. గంట లోపల స్పేర్ వీల్ తో తిరిగొస్తాను. దయచేసి మన్నించగలరు.

నా చిరునామా:
క. ఆంజనేయులు,
8-1-146,
తంబుచెట్టి స్ట్రీట్,
మద్రాసు.'

డైరీలోంచి ఆ కాగితం చింపి, "కూర్చో! ఇప్పుడే వస్తాను." వ్యాన్ దిగాడు ఆంజనేయులు.

గబగబ తన కారువైపు అడుగులు వేశాడు. ఐదు నిమిషాల్లో చేరుకున్నాడక్కడికి.

రాసిన చీటీని మడతబెట్టి, విండ్ స్క్రీన్ వైపర్ కింద ఇరికించి తేలిగ్గా ఊపిరి తీసుకున్నాడు. ఆ వ్యాన్ తాలూకు మనుషులెవ్వరైనా వస్తే ఈ చీటీ చూసి, సంతృప్తి పడతారు.

అనుకుంటూ కారు వెనక్కి వెళ్ళి, డిక్కీ తెరిచి, తాము పిక్నిక్ కోసం తీసికెళ్ళిన ప్లాస్టిక్ బుట్టలూ, స్టీలు కేరియర్ వగైరా తీసి, స్టేషన్ వ్యాగన్ వైపు నడిచాడు ఆంజనేయులు.

మాస్టర్ కీతో వ్యాన్ బ్యాక్ డోర్ తెరిచి, ఆ సామానందులో పెట్టి, కళ్ళు చిట్లించాడు. లోపల పెద్ద సైజు కార్డ్ బోర్డ్ పెట్టె కన్పిస్తోందతనికి. దాని కిరువైపులా

ఐ.బి.ఎమ్. అనే పెద్ద పెద్ద అక్షరాలు పెయింట్ చేసున్నాయి.

పెట్టెమీద చెయ్యివేసి కదిపేడు. చాలా బరువున్నట్టు తోచింది. లోపల ఏముందో చూడాలన్న కుతూహలం కలిగిందతనికి.

అంతలో_ "మీ తలతిక్క పన్లతో ఇక్కడే తెల్లారేటుంది. త్వరగా వస్తారా? లేదా?" అన్న జగదాంబ కేకతో, చటుక్కున డోర్ మూసేసి, ఫ్రంట్ సీట్ వైపు వెళ్లాడు.

స్టీరింగ్ ముందు కూర్చుని, ఇంజన్ స్టార్ట్ చేసి, ముందుకు పోనిచ్చాడు.

వ్యాగన్ అన్ని గతుకుల్లోనూ సాఫీగా సాగిపోతోంది.

దాంతో జగదాంబ చిరాకంతా మాయమై, హుషారు చోటుచేసుకుంది. ఒళ్లో వున్న ట్రాన్సిస్టర్ని ఆన్ చేసి, నాలుగైదు స్టేషన్లుతిప్పి, లోకల్ స్టేషన్ మీదికి తెచ్చింది నీడిల్ని.

"శ్రోతలకు ఒక ముఖ్య ప్రకటన! ఈ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు నేషనల్ బ్యాంకులో కనీవినీ ఎరగని విచిత్రమైన రీతిలో ఏభై లక్షల దోపిడీ జరిగింది!

మధ్యాహ్నం రెండున్నర ప్రాంతంలో, ఐ.బి.ఎమ్. కంపెనీ యూనిఫాంలు వేసుకున్న ఐదుగురు దొంగలు ఓ నీలిరంగు స్టేషన్ వ్యాగన్‌లో బ్యాంకు వెనకవైపు వచ్చి దిగారు. వాల్ట్ రూంలోవున్న కంప్యూటర్ చెడిపోయినట్లు బ్యాంకు మేనేజర్ తమ కంపెనీకి ఫోన్ చేశాడనీ, కొత్త కంప్యూటర్ తీసుకొచ్చామనీ చెప్పారు అక్కడ కాపలా వున్న వాచ్ మెన్‌కు.

వ్యాన్‌లోంచి పెద్దసైజు కార్డ్‌బోర్డ్ పెట్టె దించి లోపలికి తీసికెళ్ళారు.

ఆ పెట్టె నాలుగువైపులా ఐ.బి.ఎమ్ అనే అక్షరాలు పెయింట్ చేసున్నాయి. ఆ పెట్టెను వాల్ట్‌రూంలోకి తీసికెళ్ళి, అక్కడున్న ఇద్దరు కేషియర్లనూ, గార్డులనూ మూర్ఛపోగొట్టి, పెట్టెలో నోట్లు నింపుకుని బైటపడ్డారు.

వాళ్ళు పెట్టెని వ్యాన్‌లో పెట్టి పారిపోబోతున్న సమయంలోనే మేనేజర్ అక్కడికి రావడం, హంతకులు అయన్ను కాల్చి చంపడం, అంతలో వ్యాన్ అక్కణ్ణించి పారిపోవడం క్షణాల్లో జరిగిపోయింది...

ఆ తరవాత మిగతా హంతకులుకూడా పరారయ్యారు.

అదృష్టవశాత్తూ ఆ వ్యాన్ నెంబర్ని వాచ్‌మెన్ చూడగలిగేడు. దాని నెంబర్ 8853. ఆ నెంబర్‌గల స్టేషన్ వ్యాగన్ ఎక్కడ కనిపించినా సరే, తక్షణం పోలీసులకి తెల్పి, తగిన బహుమతి పొందవలసిందిగా నగర పోలీస్ కమీషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు...''

ఆంజనేయులు కాళ్ళు అప్రయత్నంగా క్లచ్ - బ్రేక్ వత్తేశాయి! వ్యాన్ ఒక్క కుదుపుతో ఆగిపోయింది. ఆ కుదుపుకు జగదాంబ తల డేష్‌బోర్డుకు గుద్దుకుంది.

''మళ్ళీ ప్రారంభించారా మీ వానర చేష్టలు!'' అంది మండిపడుతూ.

''అది కాదే, రేడియోలో ఇంతక్రితం వచ్చిన ఆ వార్త విన్నావా?''

''విన్నాను! ఏం?''

''ఆ దొంగలు నీలంరంగు స్టేషన్ వ్యాగన్ ఉపయోగించారు కదూ?''

''ఔను. అవన్నీ మీ కెందు కిప్పుడు?''

"వెర్రిదానా, ఆ వ్యాన్‌లోనే ఇప్పుడు మనం ప్రయాణిస్తోంది!"

"ఏమిటీ!" జగదాంబ నోరు తెరుచుకుంది.

"అంతేకాదు. ఆ దొంగలు నోట్లు నింపుకెళ్ళిన కార్డ్‌బోర్డ్ పెట్టెకూడా ఇందులోనే వుంది! నా కళ్ళారా చూశాను."

"మీరా పెట్టె తెరిచారా?"

"లేదు!"

"ఆ నోట్లింకా అందులో ఉన్నాయో, లేవో!"

"ఉన్నట్టున్నాయి! పెట్టె చాలా బరువుగా వుంది!"

"ఐతే, వెంటనే ఇంటికి పదండి!"

"అమ్మో! ఆ నేరం కాస్తా మనమీదికొస్తే?"

"చాల్లెండి, ఆ స్టేషన్ వ్యాగన్ ఇదేనని ఏమిటి రుజువు? దాని నెంబర్ 8853 అని చెప్పింది ఆనౌన్సర్. దీని నెంబర్ 1362..."

"దీని రంగుకూడా నీలం కదులే!"

"పిల్లకాయలా మాట్లాడకండి. వీటిని తయారుచేసిన కంపెనీ ఒక్కటే చేసిందా నీలంరంగు వ్యాను? ఆ పెట్టెలో ఇంకేమైనా ఉండొచ్చు. మళ్ళీ నోరెత్తకుండా నే చెప్పినట్లు పదండి ఇంటికి!"

పెళ్ళాం ముందు నోరులేని పతి ఆంజనేయులు. కిక్కురుమనకుండా వ్యాన్ని ముందుకు పోనిచ్చాడు.

కొద్దిసేపటికే మద్రాసు వెళ్ళే మెయిన్‌రోడ్ వచ్చేసింది. వ్యాన్ రోడ్డెక్కగానే ఎడంవైపు తిప్పి స్పీడ్ హెచ్చించాడు.

మైలుదూరం వెళ్ళారో లేదో, ఎదురుగా చెక్‌పోస్ట్ కనిపించింది. అక్కడ బారులుదీరి ఆగివున్నాయి అనేక

వాహనాలు. డజన్లకొద్దీ పోలీసులు అటూ, ఇటూ తిరుగుతూ చెక్ చేస్తున్నారు ఆ వాహనాలని!

"చూశావా, ఎదురుగా పోలీసులు రోడ్ బ్లాక్ చేసి చెక్ చేస్తున్నారు" అన్నాడు ఆంజనేయులు వణికే కంఠంతో.

జగదాంబ కిటికీగుండా అవతలికి తొంగి చూసి, "మీరేం ఖంగారు పడకండి! వాళ్ళు మద్రాసునించి బైటికెళ్ళే వాహనాలనే చెక్ చేస్తున్నారు. బైటినుంచి నగరంలోకెళ్ళే వాహనాలని చూట్టంలేదు" అంది నిర్లక్ష్యంగా.

"నా మాట విను! ఇక్కడే పోలీసులకా పెట్టెగురించి చెప్పేద్దాం!" అన్నాడు ఆంజనేయులు నీళ్ళు నముల్తూ.

జగదాంబ మొహం చిట్లిస్తూ భర్తవైపు చూసి, "వాళ్ళీ వ్యాన్ చెక్ చెయ్యడానికి ప్రయత్నిస్తే అలాగే చెప్పండి. లేదా, నోరు మూసుకు కూర్చోండి!" అంది.

అంతలో చెక్‌పోస్ట్‌ను సమీపించింది వ్యాన్. జగదాంబ అంచనా సరైనదే! పోలీసులు కేవలం మద్రాసు నించి బైటికెళ్ళే వాహనాలనే చెక్ చేస్తున్నారు.

స్టేషన్ వ్యాగన్ వాళ్ళను సమీపించగానే, రోడ్డు కడ్డంగా వున్న కర్ర పైకి లేపి, వెళ్ళమన్నట్లు సైగ చేశారు.

తేలిగ్గా ఊపిరి తీసుకుంటూ ఏక్సిలేటర్ని బలంగా నొక్కాడు ఆంజనేయులు. వ్యాన్ బాణంలా దూసుకు పోతూ గంటలోపల చేరుకుంది తంబుచెట్టి స్ట్రీట్.

ఇంటి కాంపౌండ్‌లో ప్రవేశించగానే, "గ్యారేజ్ దగ్గరాపండి!" అంది జగదాంబ.

గంగిరెద్దులా తలూపి, గ్యారేజ్ ముందు వ్యాన్

ఆపేడు ఆంజనేయులు. తాళం చెవులందుకుని వ్యాన్ దిగింది జగదాంబ. గ్యారేజ్ తాళం తీసి, తలుపులు బార్లా తెరిచింది.

వ్యాన్ని లోపలికి తీసికెళ్ళి ఆపేడు ఆంజనేయులు. జగదాంబ వెంటనే గ్యారేజ్ తలుపులు మూసి, లోపల లైటు వెలిగించింది.

అంతలో ఆంజనేయులు వ్యాన్ వెనక్కి వెళ్ళి బ్యాక్ డోర్ తెరిచాడు.

ఇద్దరూ కలిసి ఆ పెట్టెని అతి ప్రయాసతో కిందికి దించేరు. జగదాంబ వెంటనే పెట్టె మూత ఊడబెరికింది లోపల పేర్చివున్న నోట్ల కట్టలు చూడగానే ఆమె కళ్లు జిగేల్ మన్నాయి!

మరుక్షణం ఆమె మొహంలో విచారరేఖలుకూడా పొడసూపేయి. "మీరు చేసిన ఓ మూర్ఖపు పనివల్ల ఈ అదృష్టం కాస్తా మూన్నాళ్ల ముచ్చటయ్యేట్లుంది మనకు!"

"నేనేం చేశాను?" అన్నాడు ఆంజనేయులు అర్థం గాక.

"ఆ చీటీమీద మనింటి చిరునామా రాసి, అక్కడ వదిలేసొచ్చారుగా? అది ఆ దొంగల కంటబడిందంటే ఇంకేమైనా వుందా?"

"అయ్ బాబోయ్! ఐతే! వెంటనే మనం పోలీసుల్ని కలుసుకుతీరాలి!"

"పిచ్చి పిచ్చి వాగుడు కట్టిపెట్టండి!"

"మరేం చేద్దాం?"

"ముందీ పెట్టిని మన పెరట్లో పాతెయ్యాలి. దోపిడీ హడావుడి తగ్గేవరకూ ఈ డబ్బు జోలికి పోవద్దు మనం! తరవాత మీరు గ్యారేజ్‌లో వున్న మన కారు స్పేర్ వీల్

తీసుకొని, టాక్సీలో అక్కడికెళ్ళి, కారుకు స్పేర్ వీల్ తగిలించి, శుభ్రంగా వచ్చెయ్యండి! ఈలోగా యీ వ్యాన్‌ను ఎక్కడైనా వదిలిరండి!''

''నా సహధర్మచారిణివై వుండి, నన్నొక్కణ్ణీ ఆ నిర్జన ప్రదేశాని కెళ్ళమంటావా జగదం!'' అన్నాడు ఆంజనేయులు నీళ్ళు నములూ.

''ఖర్మ! సర్లెండి, నేనూ వస్తాను. ముందీ పెట్టెని త్వరగా పెరట్లో పాతిపెడదాం పదండి!'' అంటూ గ్యారేజ్ మూల ఉన్న గునపం అందుకుంది జగదాంబ.

8

''నిద్ర రావడంలేదా?'' అడిగాడు రజాక్ రిస్టువాచీ చూసుకుంటూ.

రాత్రి పది గంటలవుతోంది.

''లేదు! అబ్రాహాం దయనీయ మరణంతో నా మన సెందుకో ఛిన్నాభిన్నమై పోయింది. కాసేపు కూర్చుం టాను. నువ్వెళ్ళి పడుకో!'' అన్నాడు కర్ణన్.

రజాక్ ఆవులిస్తూ లేచి, బెడ్‌రూంవైపు నడిచేడు. అబ్రాహాం కోసం తెచ్చిన బ్రాందీని, ఇద్దరూ చెరిసగం లాగించేశారిదివరకే.

రజాక్ వెళ్ళాక, సిగిరెట్ మీద సిగిరెట్ కాలుస్తూ హాల్లోనే కూర్చుండిపోయేడు కర్ణన్. పరిసరాలు నిశ్శబ్దంలో నిదరబోతున్నాయి.

ఆ రహస్య ప్రదేశం తనొక్కడికే తెలుసు. రేపు రజాక్‌కు తెలియకుండా తనా ప్రదేశం చేరుకోవాలి. అంబాదాస్‌ని మట్టుబెట్టి ఆ డబ్బంతా తనే దక్కించుకోవాలి. అరగంట తరవాత, అతని ఆలోచనలను భగ్నం చేస్తూ, హఠాత్తుగా తలుపు తట్టిన చప్పుడైంది. కర్ణన్ ఉలిక్కిపడి కుర్చీలోంచి లేచాడు.

"ఎవ్వరు?"

"టెలిగ్రాం సార్!" వినిపించింది అవతలినించి.

ఇది అంబాదాస్ ఇల్లు. వాడికే వచ్చుంటుంది టెలిగ్రాం! ఎక్కణ్నించి వచ్చిందో, ఎవ్వరు చేశారో తన కనవసరమైనా, తీసుకోక తప్పదు.

లేకుంటే ఆ పోస్టల్ ఉద్యోగికి అనుమానం వేస్తుంది. ఇంటికి వచ్చిన టెలిగ్రాంని ఎవ్వరూ నిరాకరించరు మరి!

ఆ ఉద్యోగి తనను పోల్చుకోకుండా కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటున్నట్లు నటించాలి. అనుకుంటూ కర్చీఫ్ తీసి, తలుపు దగ్గరికెళ్ళి, గడియ తీశాడు కర్ణన్.

కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటున్నట్లు అభినయిస్తూ మెల్లిగా తలుపు తెరిచాడు.

ఎదురుగా నిల్చున్నది పోస్టల్ ఉద్యోగి కాదు.

పోలీసులు!!

కర్ణన్ గుండె గుభిల్లుమంది.

వాళ్ళు మామూలు లోకల్ పోలీసులుకూడా కాదు.

క్రైం బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, సార్జంట్ డేవిడ్.

ఇద్దరి చేతుల్లోనూ పిస్తోళ్ళు మెరుస్తున్నాయి.

కర్ణన్ని చూడగానే తక్షణం పోల్చుకున్నారు వాళ్లు, బ్యాంక్ రాబర్స్‌లో వాడూ ఒకడని.

"కదలక! చిటికనవేలు కదిల్చినా, ఏమాత్రం తెగించినా మా పన్నెండు గుళ్ళూ నీ గుండెలో కాపరం పెడతాయి జాగ్రత్త!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి పిస్తోలు ఊపుతూ.

కర్ణన్ ఇంకా ఆ షాక్‌లోంచి తేరుకోలేదు. శిలా ప్రతిమలా, రెప్పవెయ్యకుండా వాళ్ళనే చూస్తున్నాడు.

ఇన్‌స్పెక్టర్ చిన్నగా నవ్వి- "మేము నిన్నెలా గుర్తు పట్టామా అని ఆశ్చర్యపోతున్నావు కదూ? వ్యాన్‌లో పారిపోయిన మీ అనుచరుణ్ణి తప్ప, మిగతా వాళ్ళని తాను స్పష్టంగా చూశానన్నాడు బ్యాంక్ వ్యాచ్ మెన్. అందులో నీ పోలికలు గల వ్యక్తి తనతో చాలా సేపు బాతాఖానీ కూడా కొట్టాడని చెప్పాడు...

ఆ దోపిడీ గురించి పోలీస్ కమీషనర్ రేడియోలో ప్రకటన జారీచేయించారు. వాళ్ల ఆచూకీ తెల్పినా, ఆ వ్యాన్ వివరాలు తెల్పినా తగిన బహుమతి ఇవ్వబడుతుందని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గంటక్రితం, ఓ టాక్సీడ్రైవర్ క్రైంబ్రాంచి హెడ్ క్వార్టర్స్‌కు వచ్చి, ఈరోజు మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో, నేషనల్ బ్యాంక్ ప్రాంతంలో పార్క్ చేసున్న తన టాక్సీలోకి, ఐ.బి.ఎమ్. కంపెనీ యూనిఫారాలు తొడుక్కున్న ఇద్దరు వ్యక్తులు హడావుడిగా వచ్చి ఎక్కి, మాంబళం వీధి మొదట్లో దిగారని చెప్పాడు.

మా బలగాన్నంతా ఈ వీధిలో వదిలి, ఇంటింటికీ వెళ్ళి గాలింపు చర్యలు ప్రారంభించాం. అదృష్టవశాత్తూ మీరు నా గాలానికే తగిలారు. నువ్వు తలుపు తెరిచే వరకూ మీరీ ఇంట్లోనే వున్నారని నాకు తెలీదు. దోచుకున్న డబ్బూ, నీ మిగతా అనుచరులూ ఇక్కడే వున్నారన్నమాట! ఆల్ రైట్, చేతులు పైకెత్తి అలాగే వెనక్కి నడు!" అన్నాడు ఆజ్ఞాపిస్తూ.

కర్ణన్ ఒళ్ళంతా చెమటలతో తడిసిపోతోంది. అబ్రాహాం చనిపోయిన సంగతీ, అంబాదాస్ డబ్బుతో మాయమైన సంగతీ ఇన్‌స్పెక్టర్‌కు తెలీదు. రజాక్ లోపలున్నాడు. నిద్రపోతున్నాడు. ఏమిటి చెయ్యడం?

ప్రాణాలు పణంగా పెట్టి పడ్డ శ్రమంతా ఇంత త్వరగా నేలపాలవుతుందని తను ఊహించలేదు.

"సార్జంట్! నువ్వు వీణ్ణి కవర్ జేస్తూ ఇక్కడే వుండు. నేను లోపలికెళ్ళి మిగతా వాళ్ళ సంగతి చూస్తాను..." ఇన్‌స్పెక్టర్ నోట్లోంచి ఇంకా వాక్యం పూర్తికాలేదు.

"ఢాం... ఢాం... ఢాం..." వెనకనించి వరసగా కాల్పులు ప్రారంభమయ్యాయి. మరుక్షణం ఇన్‌స్పెక్టర్ సార్జెంట్ చేతుల్లోని పిస్తోళ్ళు కూడా ఎదురు కాల్పులు ప్రారంభించేయి. ఫైరింగ్ శబ్దాలు తప్ప, ఎవరు ఎవరి మీదా కాల్పులు జరుపుతున్నారో అర్థంకాలేదు క్షణం పాటు.

కన్నుమూసి తెరిచేలోగా ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డీ, సార్జంట్ డేవిడ్, కర్ణన్ ముగ్గురూ మొదలు నరికిన వృక్షాల్లా నేలకూలేరు. ఇన్‌స్పెక్టర్ శరీరంలో మూడు తూటాలు దిగబడ్డాయి. కింద కూలుతూ అతను కర్ణన్ని షూట్ చేశాడు రెండుసార్లు.

బెడ్‌రూం తలుపు పక్కన నక్కి వాళ్ళమీద కాల్పులు జరిపాడు రజాక్. మగత నిద్రలోవున్న అతనికి బైట ఇన్‌స్పెక్టర్ సంభాషణ వినిపించింది. పిల్లిలా లేచి తలుపుపక్క నక్కి అంతవరకూ అవకాశం కోసం ఎదురు చూశాడు.

ఐతే, రజాక్ చాలా దూరంనించి పిస్తోలు పేల్చడం వల్ల సార్జెంట్‌కూ, ఇన్‌స్పెక్టర్‌కూ ప్రాణాంతకమైన ప్రదేశాల్లో తగల్లేదు గుళ్ళు. అందుకే వాళ్ళిద్దరూ నేల కూలి స్పృహ కోల్పోయారు.

ఐతే, కర్ణన్ ఇన్‌స్పెక్టర్‌కు అతి చేరువలో వున్న కారణంగా, అతను పేల్చిన గుళ్లు కర్ణన్ ఛాతీలోనూ,

కడుపులోనూ దిగబడ్డాయి. ముగ్గురూ నేల కూలగానే, బెడ్ రూం తలుపు పక్కనించి ఇవతలికి వచ్చేడు రజాక్.

కర్ణన్ ఇంకా ప్రాణాలు వదల్లేదు. కిందపడి మూలుగుతున్నాడు. రెప్పపాటులో అతన్ని సమీపించాడు రజాక్. కర్ణన్ కళ్లు నిద్ర ముంచుకవస్తున్నట్లు మూతలు పడుతున్నాయి.

చటుక్కున కింద కూర్చొని—"కర్ణన్ కర్ణన్!" పిల్చేడు రజాక్.

కర్ణన్ అతికష్టంమీద కళ్లు తెరిచేడు. అప్పటికే అతని కళ్ళు తాగినవాడిలా బాగా ఎరుపెక్కి వున్నాయి.

"బాధ...భరించలేని బాధ...రజాక్... నేనింక... ఎక్కువసేపు...బ్రతకను...ఆ నీచుడు...అంబాదాస్... మ్ మనల్ని...మోసం చేశాడు. ఆ డబ్బులో...వాడిప్పుడెక్కడున్నాడో...నాకు తెల్సు...వ్ వెంటనే... వెళ్ళి...వ్ వాడి...అంతుచూడు..." అంటూ అంబాదాస్ తనని తీసికెళ్ళిన రహస్య స్థావరం ఎక్కడుందో పూసగుచ్చినట్లు వివరించి, తల పక్కకి వాల్చేశాడు కర్ణన్.

చేతిలోని పిస్తోలు విరిచి చూసుకున్నాడు రజాక్. అంతక్రితం జరిగిన పోరాటంలో అందులోని గుళ్లన్నీ ఖాళీఅయ్యాయి. దాన్ని కిందపడేసి, గబగబ కర్ణన్ జేబులు వెదికేడు. కర్ణన్ ఇంతవరకూ పిస్తోలు ఉపయోగించలేదని అతనికి తెలుసు.

దాన్నందుకుని లేచాడు రజాక్. ఇక తనిక్కడ ఎక్కువసేపుండకూడదు. పిస్తోళ్ళు పేలిన శబ్దాలు వీధిలో తిరుగుతున్న పోలీసులు వినివుంటారు. ఏ క్షణంలోనైనా వాళ్ళిక్కడికి పరుగెత్తుకొస్తారు.

కర్ణన్ కు స్వంత మోటర్ సైకిల్ వుంది. అదిప్పుడు గ్యారేజ్ లోనే వుండివుంటుంది. క్షణం వృధా చెయ్యకుండా బైటికి పరిగెత్తాడు రజాక్.

గ్యారేజ్ లో కనిపించింది మోటర్ బైక్. రెప్పపాటులో దాన్ని స్టార్ట్ చేసి, గేటువైపు పోనిచ్చేడు.

గేటు దాటగానే ఎడంవైపు తిప్పి వేగం హెచ్చించాడు. కొద్దిసేపట్లోనే అనేక రోడ్లు కట్ చేసి, మహాబలిపురం వెళ్ళే రోడ్డుమీద పరిగెత్తసాగింది మోటర్ బైక్.

నగరందాటిన కాసేపటికి, ఫర్లాంగు దూరంలో రోడ్డుకిరుపక్కలా ఆగివున్న వాహనాలు కనిపించేయతనికి. సందేహంలేదు. పోలీసులు వచ్చేపోయే వాహనాలని చెక్ చేస్తున్నారు. ఆ ఛాయలకి వెళ్ళడం ప్రమాదం!

ఇంజన్ ఆఫ్ చేసి, హెడ్ లైట్ ఆర్పి, మోటర్ సైకిల్ని రోడ్డు ఎడంవైపు తోసి, రోడ్డు పడివైపు దిగి, అడ్డదారిన పరుగుతీశాడు.

కర్ణన్ చెప్పిన ప్రదేశాన్ని సమీపించేసరికి రెండు గంటలు పట్టింది.

అంతలో ఎదుటినుంచి పొదలని చీల్చుకుంటూ ఏదో కారు వస్తున్నట్టు కనిపించి, చటుక్కున ఓ చెట్టుగుబురు వెనక్కి తప్పుకున్నాడు.

9

ఆ దంపతు లిద్దరూ స్టేషన్ వ్యాగన్ లో వెళ్ళిపోయిన గంట తరవాత గానీ అంబాదాస్ గుండెనొప్పి తగ్గలేదు. ఇప్పుడతనికి నరనాడులన్నీ యథాస్థితికి వచ్చి, శక్తిని పుంజుకుంటున్నాయి.

జేబులోంచి మరోరెండు కాంపోస్ మాత్రలు తీసి నోట్లో వేసుకున్నాడు. నీళ్ళవసరం లేకుండానే వాటిని

గటుక్కున మింగేశాడు. అతని బుర్రలో ఆగి ఆగి అనేక ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి.

ఆ దంపతు లెవరు? తమ స్టేషన్ వ్యాగన్ తీసుకెళ్లడం తను పొదలలోంచి చూశాడు. ఎందుకు తీసికెళ్ళారు? అసలీ నిర్జన ప్రదేశానికి వాళ్లెలా రాగలిగేరు?

అప్పుడు తట్టింది అంబాదాస్‌కు, వాళ్ళంతదూరం కాలి నడకన రావడం అసంభవం గనక, కార్లోనో, స్కూటర్ మీదో వచ్చుంటారని.

టార్చిలైట్ అందుకుని, మెల్లిగా లేచి నిల్చున్నాడు. అడుగులో అడుగు వేసుకుంటూ గుహ ముఖద్వారం దగ్గర నిల్చున్నాడు. కొమ్మలూ, రెమ్మలూ విడదీసి, బైట అడుగు పెట్టాడు. చుట్టూ మసక చీకటి కమ్ముకుంది.

టార్చి ఫోకస్ చుట్టూ దూరదూరం వరకూ వేసి చూశాడు. ఎడంవైపు కొద్దిదూరంలో ఏదో వాహనం ఆగివున్నట్లు కానవచ్చింది. చీకట్లో చిరుదివ్వెలా కనిపించిన ఆ వాహనంవైపు సాధ్యమైనంత త్వరగా అడుగులు వెయ్యసాగేడు.

రెండు నిమిషాల్లో చేరుకున్నాడక్కడికి.

అది ఫోర్డ్ కారు! దాని విండ్ స్క్రీన్ వైపర్ కింద ఏదో కాగితం ఇరికించి వున్నట్టుతోచి, చటుక్కున దాన్నందుకుని చూశాడు. మరుక్షణం అంబాదాస్ కళ్ళు జిగేల్ మన్నాయి.

ఇహ ఒక్క క్షణంకూడా తనిక్కడుండ లేదు. ఆ చీటీ చూడగానే అంబాదాస్‌కు తన శరీరంలో వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టు తోచింది.

గబగబ అడుగులు వేస్తూ తిరిగి పొద దగ్గరికి నడిచేడు. గుహలో ప్రవేశించి, ఓ మూల వున్న సూట్‌కేస్ తెరిచాడు.

అంబాదాస్ ఆరితేరిన నేరస్థుడు! నేరం చేశాక, ఎప్పుడే సమస్య ఉత్పన్నమౌతుందో, దాన్నెలా ఎదుర్కోవాలో అతనికి బాగా తెలుసు. ఆ సూట్‌కేస్‌లో సాధారణ బట్టలతో బాటు, కొన్ని విగ్గులూ, ఇతర మేకప్ సామాన్లూ నిండి వున్నాయి.

సూట్‌కేస్ క్రింద బోర్లించి, మేకప్ సామాను విడదీసి పక్కన పెట్టాడు. ఓ అద్దం ముక్క ముందుంచుకుని, చకచక ప్రారంభించేడు మేకప్ చేసుకోడం.

అరగంట తరవాత ఆ గుహలో అంతవరకూ వున్న అంబాదాస్ అదృశ్యమై ఓ చర్చి ఫాదర్ ప్రత్యక్షమయ్యేడు.

భుజాలవరకూ పడుతున్న తెల్లని జుత్తు, బారెడు గడ్డం, పండిపోయిన కనుబొమలు, మొహంమీద అక్కడక్కడా ముడతలు, కళ్ళల్లో వాత్సల్యం, పాదాలవరకూ వేళాడుతున్న పాలనురుగులాంటి తెల్లని గౌను. మెడలో గొలుసు. ఆ గొలుసు చివర ఛాతీమీద వేళాడుతున్న క్రాసు.

అద్దంలో ఆ అవతారాన్ని చూసి, చిన్నగా నవ్వుకున్నాడు అంబాదాస్. ఆ మేకప్‌కు ఫైనల్ ఫినిషింగ్ ఇస్తూ, మహాత్మాగాంధీ టైపు గుండ్రని అద్దాలుగల కళ్ళజోడు పెట్టుకున్నాడు.

ఇప్పుడతన్ని ఏ ప్రబుద్ధుడైనా చూస్తే రెండుచేతులూ జోడించి భక్తి ప్రపత్తులతో దండంపెట్టక మానడు!

పక్కనున్న పిస్తోలందుకుని విరిచి చూసేడు. ఛేంబర్లో నిండుగా నిదరబోతున్నాయి గుళ్ళు. సేఫ్టీ కాచ్ బిగించి గౌను జేబులో వేసుకున్నాడు దాన్ని.

ఆ చీటీ అందుకుని, మరోసారి ఆంజనేయులు ఇంటి అడ్రస్ చూసుకున్నాడు.

అంబాదాస్ మస్తిష్కంలో ఆ చిరునామా శాశ్వతంగా ముద్రించుకుపోయింది. అది ఆంజనేయులు చిరునామా కాదు. యాభైలక్షల అడ్రసు.

ఇక తాత్సారం చెయ్యకూడదు. అడుగులో అడుగు వేసుకుంటూ గుహ చివరికి వెళ్ళాడు. అక్కడున్న తన అంబాసిడర్ మీంచి కొమ్మలు తొలగించి, లోపల కూర్చున్నాడు. ఇంజన్ స్టార్ట్ చేసి, హెడ్ లైట్లు వెలిగించి, ముందుకు పోనిచ్చాడు.

పొదల బైటికి రాగానే కుడివైపు తిప్పి స్పీడ్ హెచ్చించాడు. ఐనా, గతుకుల దారి గనక, కారు నెమ్మదిగా నడుస్తోంది. ఫర్లాంగు దూరం వెళ్ళాక ఓ పొద ముందు నుండి వెళ్ళసాగింది కారు.

చీకట్లో ఆ పొద వెనక నిల్చున్న రజాక్ దృష్టి ఆ కారుమీదా, డ్రైవింగ్ సీటుమీదా పడగానే ఉలిక్కిపడ్డాడు.

అది అంబాదాస్ అంబాసిడర్.

ఈ నిర్జన ప్రదేశంలో, ఆ కారును ఒక ఫాదర్ నడుపుతూ వెళ్ళడం ఏమిటి? వుంది ఏదో మిస్టరీ.

అంబాదాస్ జిత్తులమారి నక్క. వాడే ఆ ఫాదర్ వేషం వేసుకు వెళుతున్నాడేమో. బహుశా, డబ్బుతో పలాయనమౌతున్నాడేమో?

కారు పొద దాటగానే, చటుక్కున చీకట్లోంచి బైటికి వచ్చి, అటు పరుగుతీశాడు రజాక్.

దారి బాగులేనందువల్ల నత్తనడక నడుస్తోంది కారు. రెండు నిమిషాల్లో చేరుకున్నాడు దాని దగ్గరికి.

ముందుకు చూస్తూ డ్రైవింగ్ గొడవలో వున్నాడు అంబాదాస్.

ఎగిరి కారు వెనక బంపర్ మీద కూర్చున్నాడు రజాక్. కాసేపలా కూర్చుని, చడీ చప్పుడూ చెయ్యకుండా డిక్కీ మూత తెరిచి చూశాడు. డిక్కీలో నోట్లపెట్టె లేదు.

కారు బాక్ సీట్లో పెట్టుకున్నాడా? ఇదీ ఒకందుకు మంచిదే అయింది. తను డిక్కీలో దూరి, వాణ్ని వెంబడించవచ్చు. అనుకుంటూ డిక్కీలో ప్రవేశించి, పైన మూత వేసుకున్నాడు రజాక్.

అంతలో మద్రాసు వెళ్ళే రోడ్డును సమీపించింది కారు. రోడ్డెక్కగానే ఎడంవైపు తిప్పి ఫుల్ స్పీడ్‌తో పోనివ్వసాగేడు అంబాదాస్.

అరగంట తరవాత నగరాన్ని సమీపించింది కారు.

ఎదురుగా అనేక వాహనాలు నిల్చున్నట్టు కనిపించడంతో స్పీడ్ కాస్త స్లో చేశాడు. పోలీసుల సోదా ఇంకా నడుస్తూనే వుంది. వాళ్ళని చూసి ఏమాత్రం చలించలేదు అంబాదాస్. నగరంనించి బైటికెళ్ళే కార్లనే వాళ్ళు చెక్ చేస్తున్నారని అతనికి తెలుసు.

ఏభై లక్షల దోపిడీకి మూలకారకుడైన అంబాదాస్‌ని పోలీసులు ఆపలేదు. పైగా, ఎంతో గౌరవం చూపుతూ, చెక్‌పోస్ట్ దాటనిచ్చేరు.

అంబాసిడర్ని వాయువేగంతో పోనిస్తూ గంట తరవాత తంబుచెట్టి, స్ట్రీట్ లో ప్రవేశించేడు అంబాదాస్.

ఆ వీధిలో, నెంబర్ 3-1-146 డాబా ఇల్లు కనుక్కోడం అతనికేమంత కష్టం కాలేదు. తెరిచివున్న గేటు గుండా కాంపౌండ్ లోకి తిప్పేడు కారుని.

సరిగ్గా అదే సమయంలో, డబ్బుగల పెట్టె పెరట్లో

పాతి, గ్యారేజ్ వైపు వెళుతున్న అంజనేయులూ, జగదాంబా కారు హెడ్ లైట్లు చూసి ఆగిపోయేరు.

అంబాదాస్ వాళ్ళకెదురుగా కారాపి దిగేడు. వేళ గాని వేళ తమ ఇంటికి ఓ ఫాదర్ రావడంతో ఆ దంపతులు చకితులై చూస్తున్నారు.

అంబాదాస్ వాళ్ళని సమీపించి "అంజనేయులు మీరేకదూ?" అడిగేడు చాలా మర్యాదగా.

"ఔను. మీరు?"

"నన్ను రెవరెండ్ జాన్ బాబు అంటారు! మీతో కాస్త మాట్లాడాలి."

"ఏం మాట్లాడాలి? అడిగింది జగదాంబ.

"డబ్బు విషయం."

"క్షమించాలి. మేము చర్చిలకి చందాలివ్వం. ఐనా, చందాలడగడానికో వేళా పాళా వుండాలి. ఇదా సమయం?" అంది జగదాంబ నిర్మొహమాటంగా.

అంబాదాస్ నవ్వి-"మీరు పొరబడుతున్నారు. నేను చందాకోసం రాలేదు" అన్నాడు సౌమ్యంగా.

"మరి?"

"యాభై లక్షలతో నిండి వున్న ఆ పెట్టికోసం వచ్చాను."

నెత్తిన పిడుగులు పడ్డట్టు అదిరిపడ్డారా దంపతులు.

అంజనేయులు మొహం చూడగానే పసిగట్టేకాడు అంబాదాస్ వాళ్ళకా పెట్టిగురించీ, అందులో వున్న ధనం గురించీ తెలసిపోయిందని.

జగదాంబ వెంటనే తమాయించుకుని — "ఏ పెట్టి? ఏ డబ్బు? మీరంటున్నదేమిటో అక్షరం ముక్క అర్థమై చావడంలేదు మాకు" అంది డబాయిస్తూ.

అంతవరకూ చిరు దరహాసం చిలకిస్తున్న అంబాదాస్ మొహం క్రూరంగా మారిపోయింది. గౌన్ జేబులో చెయ్యిపెట్టి, "ఇప్పుడే అర్థమౌతుంది!" అంటూ బైటికి తీశాడు.

ఆ చేతిలో పొగలు కక్కడానికి సిద్ధంగా వున్న పిస్తోలు చూడగానే ఆ దంపతుల గుడ్లు బైటికి వచ్చేయి.

"ఏమిటిది?" అంది జగదాంబ కంఠం పెగుల్చుకుని.

"పిస్తోలు చేబీ, పిస్తోలు. బొమ్మ పిస్తోలనుకునేవు. కావాలంటే, గున్న ఏనుగులాటి నీ శరీరాన్ని ఒక్క గుండుతో నేల కరిపించగలను...అరిచి గోలచెయ్యడానికి ప్రయత్నించారంటే, ఆ క్షణంలో హరీమంటారు జాగ్రత్త. ఊఁ, బుద్ధిగా ఇంట్లోకి నడవండి!" అన్నాడు అంబాదాస్ పిస్తోలు ఊపుతో.

ఇద్దరూ సర్కస్ శునకాల్లా ఆ రింగ్ మాస్టర్ ఆజ్ఞానుసారం ఇంటివైపు నడిచారు. అంజనేయులు గజగజ వణుకుతూ, తలుపు తాళం తెరిచాడు. ముగ్గురూ ఇంట్లో అడుగు పెట్టగానే చటుక్కున తలుపు గడియపెట్టి వెను దిరిగాడు అంబాదాస్.

"ఇదంతా నీవల్లే జరిగింది. అప్పుడే పోలీసుల్ని కలుసుకుందామంటే విన్నావా?" అన్నాడు అంజనేయులు భార్యని.

"కాదు. అంతా మీ మందబుద్ధివల్లే జరిగింది. మన ఇంటి అడ్రస్ రాసిన చీటీ అక్కడే వదలడంవల్లే కదా, ఇతనిక్కడికి రాగలిగేడు?" అంది జగదాంబ మండి పడుతూ.

"ముందా పెట్టె ఎక్కడ పెట్టారో చెప్పి, తరవాత తీరిగ్గా పోట్లాడుకోండి..." అరిచాడు అంబాదాస్.

"పెరట్లో పాతిపెట్టాం!" అన్నాడు ఆంజనేయులు గజగజ వణుకుతూ.

అంబాదాస్ ఏదో అనడానికి నోరు తెరిచాడు.

సరిగ్గా అదేక్షణంలో తలుపు తట్టిన చప్పుడయింది! ముగ్గురూ వులిక్కిపడ్డారు.

"ఎవరొచ్చారు?" అడిగేడు అంబాదాస్.

"నా స్నేహితుడు రామోజీరావయుంటాడు. మేము పిక్నిక్‌నించి రాగానే వచ్చి కలుస్తానని చెప్పేడు." అన్నాడు ఆంజనేయులు.

"ఆల్ రైట్! తలుపు కొద్దిగా తెరిచి, అలసివున్నావనీ రేపొచ్చి కలవమనీ చెప్పు. ఈ వాక్యాలకు మించి ఒక్క అక్షరం నీనోట్లోంచి వెలువడ్డా నీ భార్యని కుక్కని కాల్చినట్టు కాల్చిపారేస్తాను. నేను సోఫాలో కూర్చుని పిస్తోలుతో కవర్ చేస్తుంటాను." అంటూ సోఫావైపు నడిచేడు అంబాదాస్.

జగదాంబ బిక్కుబిక్కుమంటూ ఓ పక్కగా నిలబడింది.

అంబాదాస్ సోఫాలో కూర్చుని, గోను చాటున పిస్తోలు దాచి, తలుపువైపు గురిపెట్టి వుంచేడు.

అడుగులో అడుగు వేసుకుంటూ తలుపువైపు నడిచేడు ఆంజనేయులు.

10

కారు డిక్కీలోంచి అంబాదాస్‌కూ, ఆ దంపతులకూ జరిగిన వాగ్వివాదాన్ని చెవులు రిక్కించి విన్నాడు రజాక్. అప్పుడర్థమైందతనికి అసలు సంగతి!

తరవాత, అంబాదాస్ ఆ దంపతుల్ని పిస్తోలుతో బెదిరించి, ఇంట్లోకి తీసికెళ్ళడం, తలుపులు మూసుకున్న శబ్దం వినిపించడంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకుంటూ డిక్కీ మూత తెరిచి బైటపడ్డాడు.

జేబులోంచి పిస్తోలు తీసి, సేఫ్టీ కాచ్ వెనక్కిలాగి, అడుగులో అడుగు వేసుకుంటూ తలుపువైపు నడిచేడు. తలుపుముందాగి చెవులు నిక్కబొడిచి, లోపల జరుగుతున్న సంభాషణ వినసాగేడు.

ఆంజనేయులు ఆ పెట్టిని పెరట్లో పాతిపెట్టామని చెప్పగానే, తలుపుమీద టకటక వాయించేడు రాజాక్.

లోపల కాసేపు గుసగుసలు వినిపించేయి. ఎవ్వరో తలుపు దగ్గరికి వస్తున్నారు. తలుపు కవతల ఆగిపోయింది శబ్దం. గడియ తీస్తున్న సవ్వడి.

తయారుగా నిల్చున్నాడు రజాక్.

తలుపు కొద్దిగా తెరుచుకుంది. బైటికి తొంగిచూశాడు ఆంజనేయులు.

అంతే!___

బలంగా ఒక్కతోపుతోశాడు రజాక్ అతన్ని వెనక్కి. ఆంజనేయులు అమాంతం వెనక్కి పడిపోయాడు.

లోనికి మారుతూ రెండుసార్లు పిస్తోలు పేల్చాడు రజాక్.

గుళ్ళు రెండూ గురి తప్పకుండా వెళ్ళి, అంబాదాస్ గుండెలో దిగబడ్డాయి. అతని నోట్లోంచి కనీసం చిన్న అరుపుకూడా బైటికి రాలేదు.

అలాగే ఒరిగిపోయేడు సోఫాలో.

"లే!" అరిచాడు రజాక్ పిస్తోలు ఊపుతూ.

ఇంకా కిందపడి వణుకుతున్న ఆంజనేయులు చటుక్కున లేచి నిల్చున్నాడు.

"పదండి పెరట్లోకి. ఆ పెట్టె ఎక్కడ పాతారో చూపండి" అన్నాడు రజాక్ కర్కశంగా.

దంపతులిద్దరూ తోలుబొమ్మల్లా తలలూపి, పెరట్లోకెళ్ళే తలుపువైపు కదిలేరు.

తలుపు మూద్దామని వెనుదిరిగిన రజాక్, వెయ్యి పిడుగులు ఒకేసారి నెత్తిన కురిసినట్లు అదిరిపడ్డాడు.

తలుపు దగ్గర డజనుమంది కానిస్టేబుళ్లతో నిల్చున్నాడు అసిస్టెంట్ పోలీస్ కమీషనర్. వాళ్ళ ఆయుధాలన్నీ అతనివైపే గురిపెట్టి వున్నాయి.

రజాక్ చేతిలోంచి అప్రయత్నంగా పిస్తోలు జారి కింద పడిపోయింది.

“నీ ఆచూకీ మాకెలా తెలిసిందా అని ఆశ్చర్యపోతున్నావు కదూ? మాంబళంలోని ఆ ఇంట్లో నువ్వు ఇన్ స్పెక్టర్ రాజారెడ్డినీ, సార్జంట్ డేవిడ్ నీ గాయపరిచాక కొన ఊపిరిలో వున్న నీ అనుచరుడు-దోచుకున్న డబ్బూ, మీ నాయకుడూ ఎక్కడున్నాడో నీకు వివరించి, ప్రాణం విడిచాడు.

ఇన్ స్పెక్టర్ గాయపడ్డాడే కాని, పూర్తిగా మూర్ఛపోలేదు. నీ అనుచరుడు నీతో చెప్పిన వివరాలన్నీ వినగలిగేడు.

నువ్వు మోటర్ బైక్ మీద వెళ్ళిన కొద్దిసేపటికే, పిస్తోళ్ళ శబ్దములు విన్న మా సిబ్బంది ఆ ఇంట్లో ప్రవేశించారు. అప్పుడు చెప్పాడు ఇన్ స్పెక్టర్ వాళ్ళకు జరిగిందంతా.

నేను వెంటనే ఇద్దరు సబిన్ స్పెక్టర్లకు ట్రాన్స్మీటర్లిచ్చి, నిన్ను ఫాలో చెయ్యమని పంపేను...మహాబలిపురం వెళ్ళే రోడ్డుమీద వాహనాలు చెక్ చేస్తున్న పోలీసుల్ని చూడగానే నువ్వు మోటర్ బైక్ రోడ్డుపక్కన పడేసి, కాలి నడకన, అడ్డదారిన బయలుదేరావ్.

ఇన్ స్పెక్టర్లిద్దరూ ఆ విషయం మాకు తెలీజేసి, తమ వాహనాలు అక్కడే వదిలి నిన్ను వెంబడించారు. నువ్వా రహస్యప్రదేశం చేరగానే పొదల్లోంచి ఓ అంబాసిడర్

బయటికి రావడం, నువ్వు కారు డిక్కీలో దూరడం చూసి, వెంటనే ఆ కారు రంగూ, నెంబరూ మాకు తెలిసేశారు...

చెక్‌పోస్టు దగ్గర కావాలనే మేమూ కారును పాస్ చేసి, వ్యాన్‌లో వెంబడించి ఇక్కడికి చేరాం. మా బలగం ఈ ఇంటిని చుట్టుముట్టేలోగా నువ్వు నీ బాస్‌ని కాల్చేశావ్ ... మీ ఐదుగురు దొంగల్లో ఇక మిగిలింది నువ్వొక్కడివే!

అదృష్టవశాత్తూ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డీ, సార్జంట్ డేవిడ్‌లు నీ ఆయుధానికి ఆహుతి కాలేదు. ఇప్పుడు సురక్షితంగా హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు..." అన్నాడు అసిస్టెంట్ పోలీస్ కమీషనర్ నవ్వుతూ.

రజాక్ చేతికి బేడీలు పడ్డాయి. దంపతులిద్దరూ తెల్లబోయి చూడసాగారు.

—: ఐపోయింది :—